ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమీకరించి అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముంగిటకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుభల అక్షరం



తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం

ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com

RNI NO: TELTEL/2018/75419

సుభల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

మత్స్యకారుల రక్షణపై సమీక్ష నిర్వహించిన తమిళనాడు సీఎం విజయ్

- సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం
- సముద్రంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులపై చర్చ
- ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో తీర ప్రాంతాలపై దృష్టి
- తుపాన్లు, విపత్తుల సమయంలో మత్స్యకారుల భద్రతకు చర్యలు

చెన్నై, నవంబర్ 13 అక్షరం న్యూస్:

తమిళనాడు తీర ప్రాంతాల్లో తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల భద్రతను నిర్ధారించేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మత్స్యకారులు సముద్రంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వారి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

వివరాలు 2లో

SATURDAY 14TH NOVEMBER 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 237 COST : 3\- KHAMMAM, TELANGANA

శనివారం 14 నవంబర్ , 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :237 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJ-GIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



విజ్ఞానం, ఆధ్యాత్మికత కలిసే ముందుకు సాగుతాయి

- మైసూరులో దేశంలోనే తొలి ఎల్ఈడీ డోమ్
- ప్లానిటోరియం ప్రారంభం కాస్మోస్ మైసూరుకు శ్రీకారం చుట్టిన ప్రధాని
- అంతరిక్ష రంగంలో భారత్ విజయాలను ప్రస్తావించిన మోదీ
- ఖగోళ శాస్త్రంపై ఆసక్తి పెంచేందుకు ఆధునిక కేంద్రం



2లో

పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి: మంత్రి

- రైతులకు ఇబ్బందులు లేకుండా పక్కా ప్రణాళిక
- అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంపు
- కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా చర్యలు
- వచ్చే సీజన్ పంటల సాగుపై రైతులకు అవగాహన

నల్లగొండ, నవంబర్ 13 అక్షరం న్యూస్:

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను రాబోయే పది రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ధాన్యం సేకరణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. జిల్లాలో ఈసారి ధాన్యం ఉత్పత్తి భారీగా పెరిగిన నేపథ్యంలో కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

వివరాలు 2లో





ట్రక్ పార్క్ భూముల వేలాన్ని అడ్డుకుంటాం: హరీశ్ రావు

- మూసాపేటలో స్థలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం
- స్థానికులు, ట్రక్ డ్రైవర్లు, కార్మికులతో చర్చ
- ప్రజా అవసరాల భూములను ఎలా అమ్ముతారంటూ ప్రభుత్వంపై ప్రశ్నలు
- స్థానికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా

హైదరాబాద్, నవంబర్ 13 అక్షరం న్యూస్:

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని మూసాపేటలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ట్రక్ పార్క్ భూములను ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆందోళన చేపట్టింది. శుక్రవారం మాజీ మంత్రి హరీశ్ రావు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో కలిసి ట్రక్ పార్క్ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

వివరాలు 2లో

సిద్ధిపేట నుంచే సమరశంఖం!

- తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేస్తాం..
- ప్రజా పోరాటాలకు సిద్ధం
- పాంచజన్య అజెండాతో ప్రజల్లోకి వెళ్తాం..
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- పార్టీ కార్యాలయానికి భూమి పూజ
- ఏర్పాట్లపై కవిత అసహనం

అక్షరం న్యూస్: సిద్ధిపేట ప్రతినిధి :

సిద్ధిపేటలో తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే లక్ష్యంగా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శుక్రవారం సిద్ధిపేటలో పార్టీ కార్యాలయ భూమిపూజ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో సిద్ధిపేట కీలక పాత్ర పోషించిందని, ఈ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం అనే ఐదు ప్రధాన అంశాలతో రూపొందించిన పాంచజన్య అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్తామని వెల్లడించారు. సిద్ధిపేట జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, ప్రస్తుతం లక్ష ఎకరాలకే నీరు అందుతోందని ఆరోపించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్మాణం, నాణ్యత, అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.గౌరవెల్లి నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని, ధాన్యం



కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సిద్ధిపేటలో వ్యాపారులు, చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. మల్లన్నసాగర్, నిమ్స్ ఉద్యోగుల పెన్షన్ నిధులు, కొండపోచమ్మసాగర్ విజిలెన్స్ నివేదిక అంశాలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అన్ని చోట్ల పోటీ చేస్తుందని, సిద్ధిపేట నుంచే రాజకీయ పోరాటాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు.

వివరాలు 2లో

భారత్ సమ్మిట్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు: సీఎం

- భారత్ సమ్మిట్‌తో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు
- సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం
- పెట్టుబడులు, పర్యావరణం, మానవ వనరులపై చర్చలు
- దేశంలోనే అత్యుత్తమ గిగ్ కార్మికుల విధానం తీసుకొచ్చాం: సీఎం రేవంత్‌రెడ్డి



02లో

మొదటిపేజీ తరువాయి

విజ్ఞానం, ఆధ్యాత్మికత కలిసే ముందుకు సాగుతాయి: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 13

అక్షరం న్యూస్:

భారతదేశంలో విజ్ఞాన శాస్త్రం, ఆధ్యాత్మికత ఎప్పుడూ కలిసికట్టుగా ముందుకు సాగుతాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని కాలంలోనే మన పూర్వీకులు విశ్వం, గ్రహాల గమనంపై లోతైన అధ్యయనం చేశారని గుర్తుచేశారు. కర్ణాటకలోని మైసూరు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో దేశంలోనే తొలి ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియం 'కాస్మోస్ మైసూరు'ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.నేటి భారత యువత ఖగోళ భౌతిక శాస్త్రం, విజ్ఞాన సాంకేతిక రంగాల్లో విశేష ప్రగతి సాధిస్తోందని మోదీ ప్రశంసించారు. విశ్వంలోని అనేక రహస్యాలను తెలుసుకునేందుకు భారతీయ ఖగోళ శాస్త్రవేత్తలు సంక్లిష్టమైన గణిత లెక్కలను సమర్థంగా ఉపయోగించారని చెప్పారు. విజ్ఞాన శాస్త్రాన్ని ప్రోత్సహించడంలో మైసూరు రాజకుటుంబం చేసిన కృషిని ప్రత్యేకంగా అభినందించారు. మైసూరు విశ్వవిద్యాలయ స్థాపనతో పాటు బెంగళూరులోని భారతీయ విజ్ఞాన సంస్థ ఏర్పాటుకు భూమిని దానం చేయడం ద్వారా శాస్త్రీయ అభివృద్ధికి పునాది వేశారని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయాలను కూడా ప్రధాని ప్రస్తావించారు. చంద్రయాన్-3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. గత ఏడాది భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విజయాలు దేశ యువతలో విజ్ఞాన పరిశోధనల పట్ల ఆసక్తిని మరింత పెంచుతున్నాయని పేర్కొన్నారు.ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ నిర్మించిన ఈ ప్లానిటోరియంను ఖగోళ విజ్ఞానంపై విద్య, పరిశోధన, శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దారు. సంప్రదాయ ప్లానిటోరియాల మాదిరిగా ప్రొజెక్టర్లను ఉపయోగించకుండా ఆధునిక ఎల్ఈడీ సాంకేతికతను వినియోగించారు. 15 మీటర్ల వెడల్పు కలిగిన వంపు తిరిగిన గోపురంపై సుమారు 6,150 ప్యానెళ్లలో 4.2 కోట్ల ఎల్ఈడీలను అమర్చారు. వీటిని తక్షణమే నియంత్రించే సాంకేతికతతో నక్షత్రాలు, గ్రహాలు, విశ్వానికి సంబంధించిన దృశ్యాలను స్పష్టంగా వీక్షించే అవకాశం కల్పించారు.విద్యార్థులు, సాధారణ ప్రజల్లో ఖగోళ శాస్త్రంపై ఆసక్తిని పెంచేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పరిశోధన, శిక్షణకు ఇది కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్లానిటోరియం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు: సీఎం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ 2026 సందర్భంగా బోధి పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, కేంద్ర మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పలువురు ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ ప్రపంచ పెట్టుబడుల సదస్సు నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో వివరించేందుకు భారత్ సమ్మిట్ వేదికగా నిలుస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. గతేడాది కూడా భారత్ సమ్మిట్ నిర్వహించామని, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈసారి దాదాపు 70 దేశాలకు చెందిన వివిధ రంగాల నిపుణులు, మంత్రులు, పర్యావరణవేత్తలు, పెట్టుబడిదారులు, పాత్రికేయులు సహా సుమారు వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించినట్లు వెల్లడించారు.రెండు రోజులపాటు వివిధ అంశాలపై సదస్సులు, చర్చలు నిర్వహించి తీర్మానాలు చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో ప్రజాస్వామిక వాతావరణం, పెట్టుబడులకు అనుకూల పరిస్థితులు ఉన్నాయనే విషయాన్ని ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియజేయాలనుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణం వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకుంటారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని, వివిధ అభిప్రాయాల్లో అత్యుత్తమ విధానాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు తిరిగి వెళ్లిన తర్వాత తెలంగాణకు ప్రచారకర్తలుగా మారుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా గిగ్, వేదిక ఆధారిత కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వారికి తగిన రక్షణ లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ గిగ్ కార్మికుల విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ విధానాన్ని ఆవిష్కరించే కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు వెల్లడించారు. రెండు రోజుల భారత్ సమ్మిట్‌లోనూ రాహుల్ గాంధీ తన సందేశాన్ని వినిపిస్తారని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన తెలంగాణ ప్రపంచ పెట్టుబడుల సదస్సు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను ఆహ్వానించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. సమ్మిట్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం సమర్థనీయం కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. అర్థరహితమైన ఆరోపణలతో ప్రజలను పక్కదారి పట్టించవద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, రాష్ట్రంలోని అవకాశాలను ప్రపంచానికి తెలియజేయడం వంటి లక్ష్యాలతో పెట్టుబడుల సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాంస్కృతికంగా, సాంకేతికంగా హైదరాబాద్ సాధించిన అభివృద్ధిని పరిచయం చేస్తూ మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలకు అడ్డుపడకుండా సహకరించాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

ట్రక్ పార్క్ భూముల వేలాన్ని అడ్డుకుంటాం: హరీశ్ రావు

ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిశీలించి భూముల వినియోగం, వేలం ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.అనంతరం స్థానిక ప్రజలు, ట్రక్ డ్రైవర్లు, కార్మికులతో హరీశ్ రావు మాట్లాడారు. ట్రక్ పార్క్ భూముల వేలం ప్రతిపాదనతో ఎదురవుతున్న సమస్యలు, తమకు కలిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ట్రక్ పార్క్ అందుబాటులో లేకపోతే డ్రైవర్లు, కార్మికులు ఎదుర్కొనే సమస్యలను ఆయనకు వివరించారు. స్థానికుల ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న హరీశ్ రావు ట్రక్ పార్క్ భూముల వేలాన్ని కచ్చితంగా అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో స్థానిక ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను వేలం వేయడంపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.స్థల పరిశీలన అనంతరం అక్కడ నిర్వహించిన ధర్నాలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ట్రక్ పార్క్ భూముల వేలం ప్రతిపాదనపై తమ అభ్యంతరాలను వెల్లడించారు. ప్రజలు, ట్రక్ డ్రైవర్లు, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. స్థానికుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీలు రాజు శంభీపూర్, నవీన్ కుమార్‌తో పాటు సీపీఐ, సీపీఎం నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన ట్రక్ పార్క్ స్థలాన్ని కాపాడాలనే డిమాండ్‌తో నిర్వహించిన ఈ ఆందోళనలో స్థానికులు కూడా పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

మత్స్యకారుల రక్షణపై సమీక్ష నిర్వహించిన తమిళనాడు సీఎం విజయ్

చెన్నై, నవంబర్ 13 అక్షరం న్యూస్:

తమిళనాడు తీర ప్రాంతాల్లో తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల భద్రతను నిర్ధారించేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మత్స్యకారులు సముద్రంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వారి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.సముద్రంలో చేపల వేటకు వెళ్లిన సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వాతావరణంలో ఆకస్మిక మార్పులు, తుపాన్ల వంటి విపత్కర పరిస్థితుల్లో సముద్రంలో ఉన్న మత్స్యకారుల రక్షణకు చేపట్టాల్సిన చర్యలను సమీక్షించారు. ప్రస్తుతం తమిళనాడులో ఈశాన్య రుతుపవనాల కాలం కొనసాగుతున్న నేపథ్యంలో తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కాలంలో తుపాన్లు, ఇతర ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు, సమన్వయ చర్యల అవసరాన్ని సమావేశంలో పరిశీలించారు. తీర ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించడం, సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు అవసరమైన హెచ్చరికలు చేరవేయడం వంటి అంశాలపై చర్చించారు. విపత్తుల సమయంలో సముద్రంలో ఉన్నవారి పరిస్థితిని గుర్తించి, వారి భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టే అంశాలను సమీక్షించారు.మత్స్యకారులు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కోకుండా రక్షణ చర్యలను బలోపేతం చేయడమే సమావేశం ప్రధాన ఉద్దేశంగా సాగింది. ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో తమిళనాడు తీర ప్రాంతాల్లో తుపాన్లు, ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో మత్స్యకారుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి విజయ్ అధికారులతో సమీక్షించారు.



మొదటిపేజీ తరువాయి

పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి: మంత్రి

లక్ష్యాన్ని నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ధాన్యం ఉత్పత్తి అధికంగా ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని మంత్రి తెలిపారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ధాన్యం సేకరణలో ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే సీజన్‌లో చేపట్టాల్సిన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు ప్రణాళికపై రైతులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. రైతులకు సరైన మార్గనిర్దేశం చేయడం ద్వారా సాగులో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు కృషి చేయాలని చెప్పారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు: మంత్రి పొంగులేటి

ఖమ్మం, నవంబర్ 13 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు చేసి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, గీత, చేనేత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో చేయూత పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో కొత్తగా పింఛన్ల మంజూరైన 1,138 మందికి పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎనిమిదేళ్ల పాటు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని విమర్శించారు. అర్హులైన పేదలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ, ఏళ్ల తరబడి ఎదురుచూసినా అప్పటి పాలకులు స్పందించలేదని అన్నారు. ఎన్నికలకు ముందు పర్యటనల్లో పేదల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి చలించిపోయానని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు చేపట్టిందని వివరించారు.దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి కొత్త పింఛన్లు అందించనున్నట్లు ప్రకటించి, ఆ హామీని అమల్లోకి తెచ్చామని పొంగులేటి తెలిపారు. గత పాలకులు కమీషన్ల కోసం లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, చివరకు అది కూలేశ్వరంగా మిగిలిందని విమర్శించారు. ఇంకా అర్హులైన వారు ఉంటే పరిశీలించి పింఛన్లు మంజూరు చేస్తామని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. నేలకొండపల్లి మండలంలో కొత్తగా 1,138 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. వీరిలో 361 మంది దివ్యాంగులకు నెలకు రూ.14,49,776, 107 మంది ఒంటరి మహిళలకు రూ.2,15,712, 64 మంది గీత కార్మికులకు రూ.1,29,024, ఇద్దరు చేనేత కార్మికులకు రూ.4,032, 604 మంది వితంతువులకు రూ.12,17,664 చొప్పున నెలవారీ పింఛను అందనుంది. దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.4,016, మిగిలిన వర్గాలకు రూ.2,016 చొప్పున మంజూరు చేశారు. మొత్తంగా కొత్త లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.30,16,208 అందనుంది.పాత పింఛన్లతో కలిపి నేలకొండపల్లి మండలంలో మొత్తం 9,428 మందికి నెలకు రూ.1,64,40,896 మేర ఆర్థిక సహాయం అందుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొదాలి గోవిందరావు, నాయకులు శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

సిద్ధిపేట నుంచే సమరశంఖం!

సాదాసీదాగా సాగిన పర్యటన..

చాలా కాలం తర్వాత పార్టీ కార్యాలయ భూమిపూజ కోసం సిద్ధిపేటకు వచ్చిన కవిత పర్యటన సాదాసీదాగా సాగడం స్థానికంగా చర్చనీయాంశమైంది. రాష్ట్ర అధ్యక్షురాలి హోదాలో తొలిసారిగా సిద్ధిపేటకు వచ్చిన ఆమెకు ఘన స్వాగతం, భారీ స్థాయి కార్యక్రమం ఏర్పాటు చేస్తారని ఆశించినప్పటికీ, అందుకు భిన్నంగా కార్యక్రమం పరిమిత హడావుడితో ముగిసింది. హైదరాబాద్ నుండి వచ్చిన నేతలు చేసిన హంగామా తప్ప స్థానిక నేతలు కార్యకర్తలు హడావిడి ఎక్కడ కనిపించలేదు. స్థానిక నాయకులు సమన్వయంతో ఏర్పాట్లు చేయలేకపోయారనే విమర్శలు కిందిస్థాయి నేతల నుంచి వినిపించాయి. స్థానిక నాయకత్వం కార్యక్రమ నిర్వహణపై మరింత దృష్టి పెట్టాల్సి ఉందనే చర్చ సాగింది.

ఏర్పాట్లపై కవిత అసహనం..

కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోనూ ఏర్పాట్ల లోపాలు కనిపించాయి. జర్నలిస్టుల కోసం కేటాయించిన కుర్చీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కూర్చోవడంతో పలువురు విలేకరులు నిలబడే ప్రెస్‌మీట్‌ను కవర్ చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని గమనించిన కవిత పార్టీ నాయకులపై వేదికపైనే కొంత అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణలో తమ నేతల్లో ఇంకా మార్పులు రావాల్సి ఉందని, త్వరలోనే పరిస్థితులు మెరుగుపడతాయని ఆమె వ్యాఖ్యానించారు. దీంతో పార్టీ నేతల మధ్య ఏర్పాట్ల తీరుపై చర్చ మొదలైంది. కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర, బోడ జనార్దన్, స్టేట్ యూత్ ప్రెసిడెంట్ శివా రెడ్డి, స్టూడెంట్ ప్రెసిడెంట్ రాము యాదవ్, నాయకులు కొట్టాల యాదగిరి ముదిరాజ్, మల్లారెడ్డి, మల్సెట్టి బాపు, బాలన్న, అనురాధ, అపర్ణ, శ్రవణ్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంస్కృతిక సారధి

ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రజాకవి కాళోజీ 24వ వర్ధంతి..

ఖమ్మం/ టౌన్ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 24వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఖమ్మంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ సాంస్కృతిక సారధి ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాగి వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, పూలతో ఘనంగా అంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు నందిగామ రాజ్ కుమార్ జానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు సాహితీ సేవలను, ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు.

ప్రజల భాషలో కవిత్వం "పుట్టుక నీది, చావు

నీది, బతుకంతా దేశానిది" అంటూ తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. పండితుల భాషకు పరిమితమైన కవిత్వాన్ని సామాన్యుడి వాడుక భాషలోకి తీసుకొచ్చి, ప్రజల కష్టసుఖాలకు అక్షర రూపం ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. ఉద్యమాల ఊపిరి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన విమోచన పోరాటం నుండి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ఆయన తన కలం, గళంతో ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. అన్యాయం ఎక్కడ జరిగితే అక్కడ తన గొంతుకను వినిపించిన నికార్సయిన ప్రజాకవి కాళోజీ అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి



చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు దేవిరెడ్డి విజయ్, గుంతేటి వీరభద్రం, జానపద రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి, వి5 న్యూస్ కేవీ , దాసరి శ్రీనివాస్, నరేందర్, అడ్వకేట్ కోలాటం శ్రీకాంత్, సాంస్కృతిక సారథి మిమిక్రీ భద్ర, మేడ ముత్తయ్య, ఎర్ర గంగాధర్ మెట్టు వెంకటేశ్వర్లు తదితర ఉద్యమకారులు, కళాకారులు ప్రజా సంఘాల వారు పాల్గొన్నారు.

నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో జాతీయ మహాసభలు..

15 రైతు బహిరంగ సభ కు రైతులు తరలిరావాలి..

మహిళ రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ రైతు సంఘం మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు

ఖమ్మం/వైరా నవంబర్ 13 (అక్షరం న్యూస్)

అఖిల భారత కిసాన్ సభ (ఏఐకె ఎస్)36 వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం మహిళ కో కన్వీనర్ బొంతు సమత , మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నవంబర్ 15, 16, 17, 18 తేదీలలో నల్లగొండ జిల్లాలో నిర్వహించనున్న జాతీయ మహాసభల ప్రచార కార్యక్రమం గోల్లెన్ పాడు గ్రామం లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు రైతుల చిత్రాలు, అఖిల భారత కిసాన్ సభ బెలున్స్ తో ప్రచారం నిర్వహించారు. ఏఐకెఎస్ జెండా ను వెంపటి సత్యం ఎగురవేశారు.అనతరం జరిగిన సభలో బొంతు సమత,కిలారు శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్ వ్యవసాయం కు వ్యతిరేకంగా రైతాంగ హక్కుల సాధన, చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు వ్యవసాయ కార్మికుల సంక్షేమం, రైతు కూలీల సమస్యలపై జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. మహాసభలు సందర్భంగా నవంబర్ 15 న జరిగే రైతు బహిరంగ సభ మహాసభలను విజయవంతం చేయడానికి రైతు సంఘశీ, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం సినీయర్ నాయకులు అమరనేని అప్పారావు రైతు సంఘం గ్రామ అధ్యక్షులు వెంపటి రాజా, ఆళ్ళ శ్రీనివాస్, ధర్మారావు ఉమా,సంగిత, కృష్ణకుమారి, నాగమణి,రమ్య,అను, చంద్ర లక్ష్మి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు



కరీంనగర్ లో జరిగే ఉప సర్పంచ్, వార్డు సభ్యుల బహిరంగ సభను విజయవంతం చేయాలి..

- రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్..

ఖమ్మం/తల్లాడ నవంబర్ 13(అక్షరం న్యూస్)

రాష్ట్రంలో ఉన్న ఉప సర్పంచ్ ల, వార్డు సభ్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 27న కరీంనగర్ లో జరిగే వారి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తిక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంజిల్లా తల్లాడలో ఉపసర్పంచుల జిల్లా సమావేశం తల్లాడ మండల అధ్యక్షులు పైడిపల్లి జగన్మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉప సర్పంచ్ ల, వార్డు సభ్యుల పేర్ల శిలాఫలకాల రాసేందుకు జీవో జారీ చేయాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో అవిశ్వాస తీర్మానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ఉప సర్పంచ్ లకు 5వేలు, వార్డు సభ్యులకు 3వేలు గౌరవవేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టే బహిరంగ సభను రాష్ట్రంలో ఉన్న ఉప సర్పంచులు, వార్డు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మందపాటి వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షులు సుహాసిని సురేష్, నియోజకవర్గ అధ్యక్షులు కర్నాటి లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుజ్జర్లపూడి చింటూ, రుద్రాక్ష నరసింహచారి, జిల్లా ఉపసర్పంచ్ లు పాల్గొన్నారు.



యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించిన మోక్షజ్ఞ సాయి..

అభినందించిన తల్లాడ మండల నాయకులు..

ఖమ్మం/తల్లాడ నవంబర్ 13(అక్షరం న్యూస్)

ఖమ్మంజిల్లా తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన దీవెల బాబు (బుల్లెట్) మనవడు మోక్షజ్ఞ సాయి ఇక్ఫాయ్ యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించి విద్యారంగంలో అరుదైన ఘనత సాధించాడు. హైదరాబాదులోని ఇక్ఫాయ్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బెస్ట్ స్టూడెంట్ పెర్ఫార్మర్ గోల్డ్ మెడల్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఇక్ఫాయ్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ ఏ వినయ్, మహేంద్ర గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మాజీ సీఎం అండ్ డైరెక్టర్ రవి వెంకట్రామన్ చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఇంతటి అరుదైన ఘనతను సాధించిన సాయిని రిటైర్డ్ ఎస్సీ దిరిశాల వెంకటరామయ్య, నాయకులు దీవెల బాబు, దుండేటి వీరారెడ్డి, జక్కంపూడి కిషోర్, గ్రామ సర్పంచ్ ఎనిక కృష్ణవేణి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయి మోక్షజ్ఞ మాట్లాడుతూ తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు తాత బుల్లెట్ బాబు అందించిన స్ఫూర్తి ప్రధాన కారణమని పేర్కొన్నారు. అంతేకాకుండా బీటెక్ లో తన గురువు పవన్ కిషోర్ సలహాలు, సూచనలు ఎంతో కీలకమని, వారి మార్గదర్శకత్వం విజయం సాధించడానికి తోడ్పడిందని ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.



డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతాం..

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఆరోగ్య సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత..

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన ..

నషా విముక్త్ భారత్" లో భాగంగా పాఠశాల విద్యార్థులకు చేపట్టిన క్విజ్ పోటీల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

ఖమ్మం/ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

ఖమ్మం:మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్రం నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఇందులో సమాజంలోని ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నషా విముక్త్ భారత్ కింద పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన డ్రగ్స్ నిరోధ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో సుమారు 600 మంది సభ్యులతో ఈగల్ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల కేసులు నమోదు చేసి, 19 వేల మందికి పైగా నిందితులను అరెస్టు చేసి కఠిన శిక్షలు నమోదు చేశారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి ఎవరు ఫోన్లు చేసి సిఫార్సులు చేసినా ఉపేక్షించేది లేదని, తన సొంత మనుషులైనా సరే చట్టప్రకారం జైలుకు పంపాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని మంత్రి తెలిపారు. కేవలం వినియోగదారులపైనే కాకుండా, డ్రగ్స్ సరఫరా మూలాలను గుర్తించి వాటిని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత పాలనలో డ్రగ్స్ నియంత్రణపై చిత్తశుద్ధి కొరవడిందని, మాజీ మంత్రుల ఫామ్‌హౌస్‌లలో సైతం డ్రగ్స్ పట్టుబడటం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ ఉన్నాయన్న భయంతోనే నాటి మంత్రులు తమ పిల్లలను విదేశాల్లో చదివించుకున్నారని విమర్శించారు. కేవలం పోలీసు, ఎక్సైజ్ శాఖల వల్లే డ్రగ్స్ నియంత్రణ పూర్తిస్థాయిలో సాధ్యం కాదని, ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చిన్నతనంలోనే పిల్లల ప్రవర్తనను గమనించి, చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా వారిని కట్టడి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ఉపాధ్యాయులు పాఠాలతో పాటు విద్యార్థుల నడవడికపై కూడా కన్నేసి ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో..: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అదనపు కమిషనర్ కిషన్, డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, జిల్లా సూపరింటెండెంట్ డి. జానయ్య, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





తల్లాడ మండలంలో పింఛన్ల జోరు- పేదలింట ఆనందాల హోరు..

పదేండ్ల పేదల ఎదురుచూపులకు తెర..

కొత్త పెన్షన్ల మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. తల్లాడ మండలంలో లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందజేసిన..

ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి... సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

ఖమ్మం/తల్లాడ. నవంబర్. 13(అక్షరం న్యూస్)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతనంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వితంతు, ఆసరా, వితంతు ఒంటరి మహిళల నూతన పెన్షన్లను శుక్రవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ విజయకుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. తల్లాడ లోని జిఎన్ఆర్ గార్డెన్లో మండల వ్యాప్తంగా 993 మందికి వృద్ధాప్య పెన్షన్ల పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వృద్ధులు వితంతువులు దివ్యాంగులు మరియు ఇతర నిరుపేదలకు చేయూత పథకం ద్వారా ఆసరా పింఛన్లు అందిస్తోందన్నారు.

ఈ పింఛన్లు ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తాయి అన్నారు ప్రతినెల పింఛను అందించడం ద్వారా వారి జీవనానికి ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు మరియు పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ పథకాన్ని అమలు చేస్తుందన్నారు అభివృద్ధి సంక్షేమ ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని సందర్భంగా వారు తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరికి అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేశారని తెలిపారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్..

తల్లాడ లోని కొత్తగూడెం రోడ్డులో జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని

సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేస్తుందని, రైతులందరూ మంచి ధర పొంది ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు.

తాళ్ల జోసెఫ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే..

తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్ ను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ పరామర్శించారు.
ఇటీవల కాలుకు ఆపరేషన్ చేయించుకున్న ఆయనను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి, జిల్లా కమిటీ నాయకులు, తల్లాడ మండలం అధికారులు, తల్లాడ మండలం సీనియర్ నాయకులు , మార్కెట్ కమిటీ చైర్మన్లు,తల్లాడ మండలం ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు,టౌన్ శాఖ అధ్యక్షులు , గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు గ్రహీత సీతా మహాలక్ష్మికి ఘన సన్మానం..

ఖమ్మం జిల్లా మైనారిటీ గురుకుల విద్యాసంస్థలకు గర్వకారణం..

జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్

ఖమ్మం /నవంబర్ 13 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లా మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల--2 ప్రిన్సిపాల్ శ్రీమతి పొలిమెట్ల సీతా మహాలక్ష్మి రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్న సందర్భంగా శుక్రవారం ఖమ్మం మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల--2 ప్రాంగణంలో ఆమెకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సీతా మహాలక్ష్మి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడం, విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, విద్యార్థినుల సంక్షేమం మరియు సమగ్ర అభివృద్ధికి ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.ఈ సన్మాన కార్యక్రమానికి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.డి. ముజాహిద్ అధ్యక్షత వహించగా, రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ కె. వెంకటరామయ్య, విజిలెన్స్ అధికారులు రౌఫ్, సీతారాములు, జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలందరూ సీతా మహాలక్ష్మిని అభినందిస్తూ, ఆమె అంకితభావం, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల బాధ్యతాయుతమైన సేవలను కొనియాడారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు సాధించడం ఖమ్మం జిల్లాకు, ముఖ్యంగా మైనారిటీ గురుకుల విద్యాసంస్థలకు గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి

ఎం.డి. ముజాహిద్ మాట్లాడుతూ, సీతా మహాలక్ష్మి సాధించిన ఈ రాష్ట్రస్థాయి గుర్తింపు జిల్లాలోని అన్ని మైనారిటీ గురుకుల విద్యాసంస్థలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె విజయాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఇతర ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు కూడా మరింత అంకితభావంతో పనిచేసి రాబోయే విద్యా సంవత్సరాల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతం, అత్యుత్తమ విద్యా ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రతి గురుకుల



విద్యాసంస్థలో నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఖమ్మం జిల్లాను విద్యారంగంలో రాష్ట్రస్థాయిలో అగ్రగామిగా నిలపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం విద్యార్థినులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయుల్లో నూతన ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపింది.

వైరా లో ఎరువుల దుకాణంలను ఆకస్మిక తనిఖీ చేసిన.. ఏడిఏ బి. వాణి, ఏఓ మయాన మంజు ఖాన్

ఖమ్మం/వైరా నవంబర్ 13 (అక్షరం న్యూస్)

శుక్రవారం ఖమ్మం వ్యవసాయ సంచాలకులు(ఏడిఏ) అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్) బి. వాణి ,మండల వ్యవసాయ అధికారి మయాన మంజు ఖాన్ వైరా మండలంలోని ఎరువుల దుకాణంలను ఆకస్మిక తనిఖీ చేశారు. భాగంగా షాపులలోని ఎరువుల రిజిస్టర్లను ఈపాస్ మిషన్ లోను గోడౌన్ లో నిల్వ ఉన్న ఎరువులకు ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా ఉన్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించారు. అంతే కాకుండా ఎరువులను అమ్మే డీలర్లు ఇప్పటికప్పుడు అమ్మినటువంటి ఎరువులను రిజిస్టర్లు నమోదు చేస్తూ ఈపాస్ మిషన్లో ఆన్లైన్ చేయవలెనని సూచించారు . ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ లో బుక్ చేసుకోకుండా విరిగా అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకో నబడతాయని హెచ్చరికలు జారీ చేశారు. ఎప్పటికప్పుడు ఎరువుల ధరల పట్టికను రాసి ఉంచవలెను తెలియజేశారు. అధిక ధరలకు బ్లాక్లో అమ్మితే కఠిన చర్యలు తీసుకున్న పడతాయని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మయాన మంజు ఖాన్ వ్యవసాయ విస్తరణ అధికారులు వెంపటి కీర్తి, మేడ.రాజేష్, ఫెర్టిలైజర్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

నవంబర్ 16న కామారెడ్డి కలెక్టరేట్‌లో “పిల్లల ప్రజావాణి” కార్యక్రమం

మద్నూర్ మండల ప్రజలు బాలల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి -- సురేశ్ ఉడతావార్

మద్నూర్ / నవంబర్ 13(అక్షరం న్యూస్ - కామారెడ్డి)

మద్నూర్: బాలల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 16వ తేదీన కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో ప్రత్యేకంగా “పిల్లల ప్రజావాణి” కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధి, మద్నూర్ పారా లీగల్ వాలంటీర్ సురేశ్ ఉడతావార్ తెలిపారు.మద్నూర్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ గ్రామాల్లో ఉన్న బాలల సమస్యలను గుర్తించి, వాటి వివరాలను సేకరించి ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ముఖ్యంగా బాలల హక్కుల ఉల్లంఘనలు, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, బాలలపై హింస, నిర్లక్ష్యం, వేధింపులు తదితర బాలల పరిరక్షణకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే వాటిపై ఫిర్యాదు చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఇతర గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తమ పరిధిలో గుర్తించిన బాలల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, బాధితులు మరియు ఫిర్యాదుదారులను కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించే పిల్లల ప్రజావాణి కార్యక్రమానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

బాలల భవిష్యత్తు ప్రతి ఒక్కరి బాధ్యత!

బాలలపై జరిగే అన్యాయాలను గుర్తించి వాటిని వెలుగులోకి తీసుకురావడం ద్వారా వారికి న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సురేశ్ ఉడతావార్ పిలుపునిచ్చారు. బాలల హక్కుల పరిరక్షణలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



కాంగ్రెస్ వల్లనే పేదలకు చేయూత పెన్షన్లు

- స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)నవంబరు 13:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, పేద ప్రజల సంక్షేమమే సర్కారు లక్ష్యమని, కాంగ్రెస్ వల్లనే అర్హులైన వారందరికి నూతన చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన నూతన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఒకేసారి 4.50 లక్షల కొత్త చేయూత పెన్షన్లు మంజూరు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని, రాజకీయాలకతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. మండలంలో ఐదు కేటగిరీలకు చెందిన 1000 మంది లబ్ధిదారులకు కొత్తగా చేయూత పెన్షన్లు మంజూరయ్యాయనీ, ఈ నెల 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం పెన్షన్ డబ్బులు జమచేయనుందని తెలిపారు. అనంతరం నూతన చేయూత పెన్షన్లదారులు వెయ్యి మందికి మంజూరు పత్రాలతో పాటు 66 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 26 మందికి రూ.8.50 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు, తహసీల్దార్ రాజేష్ రెడ్డి, ఎంపీడీవో కావ్య, లింగాల జగదీష్ చందర్ రెడ్డి, గాదె మహేందర్ రెడ్డి, సర్పంచ్ లు గైని శ్రీనివాస్, వల్లాల అశోక్, బొమ్మ వీరస్వామి, గొంగళ్ల అబ్రహాం, సింగిరెడ్డి సునీత, అరూరి సరిత, పొన్నగంటి చైతన్యరాజు, ఇల్లెందుల రవి. డ్యాగల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఖాకీ దుస్తుల్లో మెరవాలన్న కలను సాకారం చేసుకోండి..

మీ విజయానికి..మా మార్గదర్శకత్వం ఎల్లప్పుడూ ఉంటుంది..

నిరుద్యోగ యువతకు మంత్రి పొంగులేటి భరోసా..

పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ శిబిరం సందర్శన..

అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ..

ఖమ్మం/ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

ఖమ్మం: పోలీసు ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో కష్టపడుతున్న నిరుద్యోగ యువత తమ కలలను సాకారం చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో ఖాకీ దుస్తుల్లో మెరవాలని అభ్యర్థులకు పిలుపునిచ్చారు. వారి విజయానికి అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని భరోసా ఇచ్చారు.పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, రైట్ ఛాయిస్ అకాడమీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్న ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ శిబిరాన్ని మంత్రి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో మాట్లాడి శిక్షణ, సన్నద్ధత తీరును తెలుసుకున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆర్థిక భారం లేకుండా పోలీసు ఉద్యోగాలు సాధించే అవకాశం కల్పించాలన్న సదుద్దేశంతో ఎంత వ్యయమైనా వెనుకాడకుండా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నిరుద్యోగ అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కోచింగ్ కార్యక్రమానికి ఏకంగా 1,25,000 మంది దరఖాస్తు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఖమ్మంలో శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న రైట్ ఛాయిస్ అకాడమీ ఛైర్మన్ మెడెం కిరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అభ్యర్థులకు 16 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. శిక్షణ అందిస్తున్న అధ్యాపక బృందాన్ని సత్కరించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ అభ్యర్థులంతా.. మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో.. మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఏదులాపురం మున్సిపాలిటీ వైస్‌ఛైర్మన్ తమ్మినేని నవీన్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం టౌన్/నవంబర్ 13 (అక్షరం న్యూస్)

రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పనితీరు,పెండింగ్ కేసులకు సంబంధించిన దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు.రౌడీషీటర్ల కదలికలపై సెక్టర్ ఆఫీసర్లు నిరంతరం నిఘా ఉంచాలని, వారి ప్రస్తుత కార్యకలాపాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ప్రవర్తన తీరును సమీక్షించాలి.పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిదంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. విజబుల్ పోలిసింగ్ పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ రిసెప్షన్‌లో ఫిర్యాదుల స్వీకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని, కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.



వైరా ఆర్య వైశ్య వాసవి క్లబ్. సంయుక్తంగా వారి ఆధ్వర్యంలో ఆర్య వైశ్య వన సమారాధన

ఖమ్మం/వైరా నవంబర్ 13 (అక్షరం న్యూస్)

ఆర్య వైశ్య వైరా మండల, పట్టణ సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆర్య వైశ్య వన సమారాధన కార్యక్రమం కి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వసమా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో..మండల అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ కుమార్ పట్టణ అధ్యక్షులు దారా వెంకట కృష్ణ.. కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ది.15-11-2026 ఆదివారం సోమవరం గ్రామంలో ఉన్న మిట్టపల్లి శ్రీనివాసరావు, నాగేంద్రబాబు ల మామిడి తోట నందు ఉదయం గం:07:30 నుండి కార్యక్రమం నిర్వహించబడుతుంది అని కావున ఆర్య వైశ్య వైరా మండలం, పట్టణానికి సంబంధించిన ఆర్య వైశ్యులు అందరు కుటుంబసమేతంగా రావాలని ఆహ్వానిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనా డాక్టర్ అసిఫా

జనగామ జిల్లా/ రఘునాథపల్లి/(అక్షరం న్యూస్) నవంబర్ 13:



ఇటీవల ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అసిఫా "బ్రతుకు బొమ్మలాట"అనే నాటికను ప్రదర్శించారు. ఆమె ప్రదర్శించిన" బ్రతుకు బొమ్మ లాట'అనే నాటిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు శుక్రవారం సమాచారం అందినట్టు మండలం పశు వైద్యాధికారి డాక్టర్ అసిఫా తెలిపారు.2027 జనవరి ఢిల్లీలో నిర్వహించే పోటీల్లో ఆమె పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా తోటి సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

పసి హృదయాల పాలిట పెద్ద మనసు చాటుకున్న శీనన్న..

తలసేమియా బాధిత చిన్నారులకు చేయూత పింఛన్ల మంజూరు..

మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు

ఖమ్మం/ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

ఖమ్మం: తలసేమియా వ్యాధితో పోరాడుతున్న చిన్నారుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీసుకున్న చొరవపై బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. చేయూత పథకం కింద పింఛన్లు మంజూరు చేయించడంతో తమకు ఎంతో ఊరట లభించిందని పేర్కొంటూ శుక్రవారం పలువురు తలసేమియా బాధితులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.గతంలో ఎంపీగా ఉన్నప్పుడే తలసేమియా బాధితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించిన పొంగులేటి.. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా కూడా వారి సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని గుర్తుచేశారు. ఆయన చొరవతో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ పరిధిలోని సుమారు 150 మంది చిన్నారులతో పాటు జిల్లాలోని వందలాది మంది బాధితులకు పింఛన్లు మంజూరు కానుండటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.తమ కష్టాలను గుర్తించి ఆర్థికంగా అండగా నిలిచిన శీనన్నకు చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు, సంస్థ ఉపాధ్యక్షురాలు పొద్దుటూరి పావని, సభ్యులు అనిత, ఉదయ భాస్కర్ తదితరులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



తల్లాడ మండలంలో చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ చేసిన...

ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి

ఖమ్మం/తల్లాడ నవంబర్ 13 (అక్షరం న్యూస్)



తల్లాడ లో జీఎన్ ఆర్ గార్డెన్స్‌లో మండలానికి సంబంధించిన ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు మంజూరైన చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డితో కలిసి సత్తుపల్లి ఎమ్మెల్యే శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. పెన్షన్లు అనేవి కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు తోడ్పడే భరోసా అని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ, సంక్షేమం, అభివృద్ధి రెండు లక్ష్యాలుగా ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాది పేదల పక్షపాత ప్రభుత్వం

అందుకే రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లిచ్చాం ..

కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసిన లబ్ధిదారులకు ఈనెల 19 నుంచే ఆర్థిక తోడ్పాటు..

కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా లక్ష్యం..

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

కూసుమంచి మండలంలో 1,071 మందికి, ఖమ్మం రూరల్ మండలంలో 851 మందికి నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ ..

ఖమ్మం/ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

కూసుమంచి/ ఖమ్మం రూరల్: ఈ ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని, నిరంతరం వారి సంక్షేమానికి పాటుపడుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డి స్పష్టం చేశారు. చేయూత పథకంలో భాగంగా కూసుమంచిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 1,071 మందికి, ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలోని హైస్కూల్ గ్రౌండ్ లో 851 మందికి నూతన పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాద్ లో లక్ష ఇళ్లను పేదలకు కేటాయించామని, ఫైనల్ బిల్లులను ఈ నెలలోనే మంజూరు చేస్తామని ప్రకటించారు. గత పాలకులు పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ఎనిమిదేళ్లలో ఒక్క పింఛన్ కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. తమ ప్రజా ప్రభుత్వంలో చేయూత పింఛన్ల కోసం మంజూరు పత్రాలు అందజేస్తున్నామని, ఈనెల 19వ తేదీ నుంచే లబ్ధిదారులకు ఆర్థిక భరోసా అందిస్తుందని ప్రకటించారు. కూసుమంచి కేంద్రంలో వంద పడకల ఆసుపత్రితో పాటు కొట్లాది నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల కమిషనర్ తొత్తుగా మారి 7కోట్ల ఓట్లను తొలగించారని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసుకోవడమే తమ లక్ష్యమని వెల్లడించారు.
ఈ కార్యక్రమాల్లో..: కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండల అధ్యక్షులు బజ్జురి వెంకటరెడ్డి, ఖమ్మం రూరల్ మండలాధ్యక్షులు తోట వీరభద్రం, పలువురు అధికారులు, సర్పంచ్ లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా నమోదు చేయాలి- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీమా పథకం అమలు..

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ

గ్రామాలు, పట్టణ వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు..

నవంబర్ 18న టాంటాం ద్వారా విస్తృత ప్రచారం

18--59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుల వివరాల సేకరణకు ప్రాధాన్యత

నామినీ వివరాలు, ఆధార్, మొబైల్ నంబర్ల నమోదులో కచ్చితత్వం పాటించాలి..


దరఖాస్తుల డిజిటలైజేషన్, బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేయాలి..

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన డిప్యూటీ సీఎం..

ఖమ్మం/ నవంబర్ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దేశంలోనే వినూత్నమైనదని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని తెలిపారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా తెలంగాణలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక జిల్లాలో ఈ పథకాన్ని ప్రారంభిస్తారని, అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా పథకం అమల్లోకి వస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. నవంబర్ 14న జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నుంచి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో నిర్వహించిన తాజా కులగణన సర్వే ద్వారా కుటుంబాలకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రతి గ్రామం, పట్టణ వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాలు..



నవంబర్ 19న ప్రతి గ్రామంలో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి కుటుంబాల వివరాలు సేకరించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. గ్రామాలు, మండలాలు, డివిజన్లు, పట్టణ వార్డుల స్థాయిలో నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి పథకం సమాచారం చేరేలా చూడాలన్నారు. నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. పంచాయతీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ప్రజలకు పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు.కుటుంబ పెద్ద తమ కుటుంబానికి సంబంధించిన నామినీ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, ఒకరు లేదా ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ప్రతిపాదించవచ్చని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, కుటుంబానికి సంబంధించిన జీవిత బీమా కవరేజీ కోసం 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుల వివరాలను కచ్చితంగా సేకరించాలని సూచించారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు.దరఖాస్తులో జిల్లా, మండలం, గ్రామం లేదా వార్డు వివరాలతో పాటు బీమా పొందే వ్యక్తి పేరు, తండ్రి లేదా భర్త పేరు, లింగం, ఆధార్ ప్రకారం పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ నమోదు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల పేర్లు, వారి ఆధార్ నంబర్లు కూడా సేకరించాలన్నారు.నామినీ పేరు, సంబంధం, ఆధార్ వివరాలతో పాటు ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలుగా ఉంటే వారికి కేటాయించే వాటా వివరాలను నమోదు చేయాలని తెలిపారు. నామినీ మైనర్ అయితే వారి సంరక్షకుడు లేదా ప్రతినిధి వివరాలు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. దరఖాస్తుపై దరఖాస్తుదారుడితో పాటు వివరాలను పరిశీలించిన అధికారి సంతకం ఉండాలని స్పష్టం చేశారు.దరఖాస్తుల డిజిటలైజేషన్‌లో పొరపాట్లకు తావివ్వొద్దుసేకరించిన దరఖాస్తులను డిజిటలైజేషన్ చేసి, సంతకం చేసిన దరఖాస్తుల స్కాన్ ప్రతులను బీమా సంస్థకు పంపించాలని సీఎస్ సూచించారు. అసలు దరఖాస్తులను జిల్లా స్థాయిలో భద్రంగా భద్రపరచాలని తెలిపారు. రాబోయే 15 నుంచి 20 రోజుల పాటు అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనిచేసి ప్రతి అర్హ కుటుంబానికి బీమా రక్షణ కల్పించేలా వివరాల సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు.నామినీ వివరాలు, ఆధార్ నంబర్లు, ఇతర సమాచారాన్ని నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డిజిటల్ రికార్డుల్లోనూ కచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు.

బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి స్పష్టమైన విధానం..

బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీడీఓ, జిల్లా స్థాయి సంబంధిత అధికారి, జిల్లా కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వరకు నిర్దేశించిన విధానంలో దరఖాస్తు చేరేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ తెలిపారు. అనంతరం బీమా సంస్థ ద్వారా నామినీకి రూ.5 లక్షల బీమా మొత్తం అందేలా ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు.మున్సిపాలిటీల్లో వార్డు అధికారి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత జిల్లా స్థాయి అధికారి ద్వారా క్లెయిమ్ ప్రక్రియ కొనసాగాలని, మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు అధికారి, డిప్యూటీ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ స్థాయిలో చర్యలు చేపట్టాలని వివరించారు.జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్లెయిమ్‌లు, పెండింగ్ కేసులను నిరంతరం పర్యవేక్షించాలని, అసలు దరఖాస్తుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ ఏ. శ్రీనివాస్, డిపివో జి. వినోద్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట 14వ వార్డులో చేయూత పింఛన్ల పంపిణీ

అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేత

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / నవంబర్ 13 / అక్షరం న్యూస్ :

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో సంక్షేమ పథకాల అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం చేయూత పింఛన్లను స్థానిక కౌన్సిలర్ డాక్టర్ ఉదయజ్యోతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.అర్హులకు సంక్షేమ ఫలాలు 14వ వార్డుకు చెందిన ఆరేపల్లి సింధు, సరిదే వెంకటలక్ష్మి, బందా పద్మ, నిగమను సూర్యకుమారి, సంక్రాంతి రాధాదేవి తదితరులకు పింఛన్ మంజూరు పత్రాలను డాక్టర్ ఉదయజ్యోతి అందజేశారు.డాక్టర్ ఉదయజ్యోతి మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు సక్రమంగా అందేలా కృషి చేస్తామని, వార్డు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఈ సందర్భంగా డాక్టర్ ఉదయజ్యోతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



రబీ సాగులో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలి...

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి..

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు సన్న వడ్లకు కనీస మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి..

యంగ్ ఇండియా పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి..

సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను గడువులోగా పూర్తి చేయాలి

వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్య, భూసేకరణ, వీబీ జీ రామ్ జీ, వీధి కుక్కల నియంత్రణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్..





ఖమ్మం /నవంబర్ 13(అక్షరం న్యూస్)

రాబోయే రబీ 2026-27 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు.ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేని పరిస్థితుల నేపథ్యంలో వరి సాగును నివారించి ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సిఎస్ కలెక్టర్లకు ఆదేశించారు.శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వీబీ జీ రామ్ జీ, పనుల పురోగతిపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ పలు అంశాలను సమీక్షించారు. ఖమ్మం లిజిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్‌లి కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని,రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేనందున వరి సాగును నివారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైతులను ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని, సూక్ష్మ సేద్య విధానాలను ప్రోత్సహించాలని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ, ఖరీఫ్ పంటల ఉత్పాదకత పెంపు, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నష్టం జరగకూడదనీ, ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు. రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ సన్న వడ్లకు కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోకుండా చూడాలని స్పష్టం చేశారు.అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనుగోళ్లకు సిద్ధంగా ఉంచాలని, రైతులందరి వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం సేకరణ ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలనీ అన్నారు. విద్యాశాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ సూచించారు. ఎఫ్‌ఆర్ఎస్ ద్వారా హాజరును పర్యవేక్షించాలని, విద్యార్థుల హాజరు కనీసం 90 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాఠశాలల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని క్రమం తప్పకుండా సమీక్షించాలని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు మెరుగ్గా ఉంటే విద్యార్థుల హాజరు కూడా పెరుగుతుందని, క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.విద్యా మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలి రూసా 2.0, పీఎం ఉషా పథకాల కింద మొత్తం 41 పనులు మంజూరు కాగా, ఇప్పటివరకు 8 పనులు పూర్తయ్యాయని, మరో 33 పనులు పురోగతిలో ఉన్నాయని సీఎస్ తెలిపారు. మంజూరైన నిధుల్లో ఇప్పటివరకు 41 శాతం మాత్రమే ఖర్చు చేసినందున మిగిలిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ. 625 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పనుల పురోగతిని కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణలో జాప్యం ఉండకూడదని, ప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సీఎస్ సూచించారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులను కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సీఎస్ సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎడీ+=మావీ+ పథకం కింద చేపట్టే పనులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, గ్రామాల్లో నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సూచించారు. నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులను విస్తృతంగా చేపట్టాలని, అన్ని కాలువలను శుభ్రం చేసి అవసరమైన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోళ్లలో జాప్యం వద్దు..

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ చిరంజీవి.

సంగారెడ్డి జిల్లా / నారాయణఖేడ్/అక్షరం న్యూస్:

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వరి పంట సాగు చేసిన రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి పంట పండిస్తే, పంట చేతికి వచ్చిన స మయంలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొను గోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలుపేరుకుపోతున్నప్పటికీ సంబం ధితఅధికారులు స్పందించకపోవడంవిచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగ వంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు క లగకుండా అవసరమైనగన్నీసంచులు,రవాణాసౌకర్యాలు కల్పించడంతో పాటు కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏ ర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను వెంటనే రైతుల ఖా తాల్లో జమ చేయాలని, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకుగురిచేయవద్దని కోరారు. రైతులకష్టాన్నిగుర్తించి. ప్రభుత్వంబాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరిని విడనాడి వెంటనే ధాన్యం కొనుగోళ్ల చేపట్టాలని చిరంజీవి డిమాండ్. చేశారు. ఇ ప్పటికైనాప్రభుత్వం,సంబంధితఅధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కా ర్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



జ్యోతి రావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అఫ్జల్ ఖాన్

అనాథ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ

శామీర్ పేట నవంబర్ 13 అక్షరం న్యూస్:

జ్యోతి రావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని అఫ్జల్ ఖాన్ అన్నారు. శుక్రవారం సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ జ్యోతి రావు పూలే 136వ వర్ధంతి సందర్భంగా శామీర్ పేట్ లో ని మాతృ శ్రీ అనాథ ఆశ్రమంలో పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ అనాథ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు సమాజంలో ఎన్నో అవరోధాలు, ఆటంకాలు ఎదురైనా జ్యోతి రావు పూలే ఆయన సతీమణి సావిత్రి బాయి పూలే లు కలిసి సంఘ సేవ లో విశేష కృషి చేసి సాఫల్యం పొందారని తెలిపారు. విద్యా వ్యాప్తి కి కూడా విశేష కృషి చేసి సాఫల్యత సాధించారని అఫ్జల్ ఖాన్ వారి ఆదర్శాలను కొనియాడారు. వారి ఆదర్శాలు అందరికి మార్గ దర్శం కావాలని అఫ్జల్ ఖాన్ తెలిపారు. మాతృ శ్రీ అనాథ ఆశ్రమంలో వృద్ధులకు అండగా ఉండాలని అఫ్జల్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటు ఉపాధ్యాయులు, నాయకులు పి నర్సింహా రెడ్డి, బత్తిని రాజు గౌడ్, ఆశ్రమం ఇంచార్జి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



గడ్డివాము దగ్ధం..రైతుకు రూ.80 వేల నష్టం

హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి / నవంబర్ 13 /అక్షరం న్యూస్:

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమై రైతుకు తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన భీమదేవరపల్లి మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు వెంటనే సర్పంచి మాచర్ల కుమారస్వామికి సమాచారం అందించడంతో ఆయన స్పందించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే సాయంత్రం 5 గంటలకు సమాచారం అందించినప్పటికీ రాత్రి 8 గంటల వరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకోలేదని సర్పంచి ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక సర్పంచి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బండి రాజయ్య తన పాడి పశువుల కోసం వ్యవసాయ బావిల దారి సమీపంలోని బండపై గడ్డివామును ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివాముకు మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. గమనించిన గ్రామస్థులు వెంటనే మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.80 వేల విలువైన గడ్డి దగ్ధమైందని బాధిత రైతు బండి రాజయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. పాడి పశువుల మేత కోసం నిల్వ చేసుకున్న గడ్డి అగ్నికి ఆహుతి కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపాడు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందించినా అగ్నిమాపక శాఖ సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి బాధిత రైతుకు నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి.

ప్రపంచ మానవ హక్కుల సంఘం.

సంగారెడ్డి జిల్లా/ మనూర్ / నవంబర్ 13/ అక్షరం న్యూస్:

మానూర్ మండల పరిధిలోని బోరంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, రచనా నైపు ణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం ఫౌండర్ ఁ జాతీయ చైర్మన్ కాసల కోనయ్య అదేశల మేరకుజిల్లా చైర్మన్ బైండ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సంగమే శ్వర్,జిల్లా స్టూడెంట్ వింగ్ చైర్మన్ కె. సంగమేశ్వర్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి అధ్యక్షత వ హించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో ప్రతిభ కన బరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభి నందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడు తూ బాలలే దేశ భవిష్యత్తుకు పునాదులని, ప్రతి చిన్నా రికి నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు కల్పించడం తో పాటు వారి హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బా ధ్యత అని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మంచి నడవడిక, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థు ల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించినప్పుడే వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, విద్యార్థుల అ భ్యున్నతి కోసం ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో బోరంచ గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్, వివిధ పాఠశాల లకు చెందిన ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. బాలల దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు మంచి వేదికగా నిలిచాయి.



త్యాగాలు మావి భోగాలు మీవ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి..

మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు బంగారు మల్లేష్ చారి

శామీర్ పేట నవంబర్ 13 అక్షరం న్యూస్:



తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు బంగారు మల్లేష్ చారి (శ్రీనివాస్) మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా గతంలో శ్రీకృష్ణ కమిటీ వేసినట్టుగా కేశవరావు కమిటీ నీ కాలయాపన కమిటీ అని, ఉద్యమకారులు మొదటి నుంచి చెప్తానే ఉన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని గతంలో రేవంత్ రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని 25 వేల పెన్షన్ గుర్తింపు కార్డులు ఉద్యమకారుల ఫ్యామిలీ ఇన్సూరెన్స్ ఇలాంటి ఎన్నో వాగ్దానాలు చేయడం జరిగిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న కమిటీల పేరుతోనే ప్రభుత్వం సాగదీసే ధోరణి కనపడుతుంది. గతంలో 28-1-2010 నేరేడ్ మెట్ ఎక్స్ రోడ్ జెఎసి లోని ఆజాద్ దిష్టిబొమ్మ దహనశీ సోనియాగాంధీ సేవయాత్ర నేరేడ్మెట్ ఎక్స్ రోడ్డులో ధర్నా రాస్తారోకోలు చేసి నిరసన తెలుపడం జరిగింది సిఐ వెంకట్ రెడ్డి ఉన్నప్పుడు అరెస్ట్ చేసి నేరేడ్మెట్ పిఎస్ లో ఎఫ్ఐఆర్ బుక్ చేయడం జరిగింది. ఉద్యమాలు చేయడం మా కొత్త కాదు ధర్నాలు రాస్తారోకోలు మిలియన్ మార్చ్ సాగరారం రాష్ట్ర బందులు ధర్నా రాస్తారోకో రైలు రోకో వంటావార్పు కొవ్వొత్తుల ర్యాలీ కాగడాల ర్యాలీ జేఏసీ తరపున ఎన్నో కార్యక్రమాలు చేయడం జరిగింది. మరి ప్రభుత్వ స్పందించకమంటే కమిటీలతోని కాలయాపన చేయకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి వీలైనంత తొందరగా ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాలని మరొకసారి ఉద్యమకారులు పెద్ద ఎత్తున నిరసన తెలుపడానికి పెద్ద ఎత్తున ఉద్యమకారులు అందరు కలిసికట్టుగా రావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బ్రతికిన‌న్నాళ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటాం..

- **తల్లాడ పెన్షన్ల పంపిణీలో ఓ మహిళ కన్నీటి గాథ..**
- **ఎమ్మెల్యే రాగమయి దంపతులు కంటతడి..**



ఖమ్మం/తల్లాడ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

నా కుమారుడు అరుదైన తల సేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. అతన్ని బ్రతికించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నో ఏళ్లు గడిచాయి.. ఎన్నో ప్రభుత్వాలు మారాయి.. అయినా కూడా ఏ ప్రభుత్వము కనికరించలేదు. నాలాంటి వాళ్లు ఈ రాష్ట్రంలో చాలామంది అమ్మల అందరి బాధలను ఆ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విన్నాడో.. ఏమో కానీ.. నాలాంటి కుమారులకు నూతనంగా పెన్షన్ అందించి, బ్రతుకుతాడన్న భరోసా కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మేము బ్రతికినంత కాలం రుణపడి ఉంటామంటూ ఓ మహిళ కాళ్ళ మీద పడి కన్నీటి పర్యంతమైన ఘటన శుక్రవారం ఖమ్మం జిల్లా తల్లాడలో చోటుచేసుకుంది. తల్లాడలో నూతన పెన్షన్ల మంజూరి పత్రాలను అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీ రఘురామిరెడ్డి, సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తన బాధను వెలిబుచ్చేందుకు మాట్లాడేందుకు స్టేజి పైకి వచ్చిన తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన కృష్ణవేణి తన బాధను చెప్పుకుంటూ ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.. అన్న మాటలు అక్కడున్న ఎమ్మెల్యే దంపతులతో పాటు సభికుల కళ్ళల్లో నుంచి కన్నీరు కారాయి. తలసేమియా వ్యాధితో తనతో పాటు రాష్ట్రంలో అనేకమంది తల్లులు బాధపడుతున్నారని, ఈ వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్పించి, నాలాంటి తల్లులకు కుమారులను బ్రతికించాలని, దీన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలని ముఖ్యమంత్రికి కన్నీరు ద్వారా విన్నవించారు. దీంతో అక్కడున్న ఎమ్మెల్యే దంపతులు, హాజరైన మహిళలందరూ కన్నీటి పర్యంతమయ్యారు.

కంటతడి పెట్టిన దయానంద్..

తలసేమియా వ్యాధితో తన కుమారుడు అనేక ఇబ్బందులు పడుతున్నాడని, కుమారున్ని బ్రతికించాలని ప్రసంగించిన ఆ మహిళ మాటలు విన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతమట్టా దయానంద్ చలించిపోయారు. ఆయన మాట్లాడుతున్న సమయంలో తలసేమియా వ్యాధితో తన కూతురు కూడా మరణిం చిందని, ఇటువంటిది రాష్ట్రంలో ఏ తల్లులకు కూడా జరగకూడదని సబ్దత హృదయంతో నిమిషం పాటు కంటతడి పెట్టారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే మట్టా రాగమయి తమ కూతురు కూడా ఆ వ్యాధితో చనిపోయిందని, ఆమె పేరు మీదనే అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు గుర్తు చేశారు. ఈ తలసేమియా వ్యాధి గురించి పార్లమెంటులో మాట్లాడాలని పక్కనే ఉన్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డికి సభాముఖంగా తెలియజేశారు.

మంత్రి పొంగులేటి కి చిత్తారు వారి వివాహ ఆహ్వానం ..

- **ఆహ్వాన పత్రిక అందించిన మేకల మల్లి బాబు యాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్**



ఖమ్మం/వైరా నవంబర్ 13(అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి ఖమ్మంలోని వారి స్వగృహంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యువజన అధ్యక్షులు చిత్తూరు సింహాద్రి యాదవ్, పొంగులేటి ప్రధాన అనుచరుడు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తో కూడి ఈనెల 15 వ తారీకు ఆదివారం బోనకల్ రోడ్ లోని లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో జరగనున్న చిత్తారు సింహాద్రి యాదవ్– మాధవిల కూతురు జోషిత – గురునాథ్ ల వివాహానికి ఆహ్వానం అందించారు. ఎన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ తప్పకుండా వచ్చి నూతన జంట ను ఆశీర్వదిస్తానని చెప్పినట్లుగా మల్లి బాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నెబోయిన సీతారామయ్య, బొర్రా రాజశేఖర్, ఉన్నం బ్రహ్మయ్య, ప్రతాప్, తుప్పాతి రవి పొట్లపల్లి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

కొనిజర్ల లో ఇందిరమ్మ ఇల్లును పరిశీలించిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



ఖమ్మం/ వైరా నవంబర్ 13(అక్షరం న్యూస్)

కొనిజర్ల మండలం కేంద్రంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఇందిరమ్మ ఇల్లును చూసి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక చేపట్టిన స్కీమును అరులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తానని ఎమ్మెల్యే చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూరంపల్లి రామారావు కొనిజర్ల సర్పంచ్ గూదే పుష్పవతి ఉపేంద్ర, మాజీ సొసైటీ చైర్మన్ నెల్లూరు రమేష్ కొణిజర్ల గ్రామ ఉపసర్పంచ్ కొనకంచి మోషే కొనిజర్ల ఎస్సై డి. హరిత, కొనిజర్ల గ్రామ సెక్రెటరీ రమేష్, కొణిజర్ల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గంధం నాగ కాశీ మాల భాస్కర్ యామల శ్రీకాంత్ కాశీ మాల సుధాకర్ గోడ్డుగొర్ల నాగయ్య తుప్పతి నాగ పొట్ట బత్తిని శీను ఆమదల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం క్లబ్‌లో నూతన చేయూత పెన్షన్ మంజూరు ఉత్తర్వుల పంపిణీ..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ కొత్తగూడెం నవంబర్ 13 (అక్షరం న్యూస్)

కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన చుంచుపల్లి, లక్ష్మిదేవిపల్లి మండలాల నూతన చేయూత పెన్షన్ మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు ఉత్తర్వులను చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తామని అన్నారు.నాగా సీతారాములు యాదవ్ మాట్లాడుతూ...కొత్తగూడెం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయడానికి కృషి చేస్తున్నామని, ఎవరూ అర్హత ఉండి మిగిలిపోకుండా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మోడి గణేష్, ఏఎంసీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్, కార్పొరేటర్లు, సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖమ్మం మైనారిటీ గురుకుల గర్ల్స్ 2 ప్రిన్సిపాల్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డ్..



ఖమ్మం/ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

డిస్టిక్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మహమ్మద్ ముజాహిద్దీన్ ,విజిలెన్స్ ఆఫీసర్ ఖమ్మం డిస్టిక్ సీతారాములు వెంకట్రామయ్య , వారి చేతుల మీదుగా శుక్రవారం పాఠశాలలో ఉత్తమ ప్రిన్సిపల్ గా స్టేట్ లెవెల్ లో అవార్డు తీసుకున్న సీతా మహాలక్ష్మి నీ సన్మానించడం జరిగిందిఖమ్మం: తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల విభాగంలో ఉత్తమ ప్రిన్సిపల్ గా ఖమ్మం మైనారిటీ గర్ల్స్--2 ప్రిన్సిపల్ పొలిమెట్ల సీతా మహాలక్ష్మి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా 13-11-2026 న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ బంజార భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆమె ఉత్తమ ప్రిన్సిపల్ గా అవార్డును అందుకున్నారు.విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, విద్యార్థినుల సంక్షేమము సమగ్ర అభివృద్ధికి ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.ఈ పురస్కారంతో ఖమ్మం జిల్లా మైనారిటీ గురుకుల విద్యాసంస్థ కు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీతా మహాలక్ష్మిని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిశ్రీ ముజాహిద్ గారు సన్మాన కార్యక్రమాన్ని 11-11-2026 న తెలంగాణా మైనారిటీ గురుకులం ఖమ్మం గర్ల్స్-2 నందు నిర్వహించుట జరిగింది కార్యక్రమానికి రీజినల్ లెవల్ కో ఆర్డినేటర్ . కె. వెంకటరామయ్య, విజిలెన్స్ అధికారులు సీతారాములు మరియు రావుఫ్ ఇతర గురుకులాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థినులు, జమాత్ -ఇస్లాం సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతర ప్రణాళికలను రచిస్తూ తాను ఎల్లవేళలా పాఠశాల కొరకు కృషిచేసిన సీతామహాలక్ష్మి మరిన్ని అవార్డులు అందుకోవాలని విద్యారంగంలో ఆమె అందిస్తున్న సేవలు మరింత మందికి స్ఫూర్తిదాయకం అని అన్నారు.

నేలకొండపల్లిలో ఘనంగా చేయూత పెన్షన్ల పంపిణీ...

- **పెన్షన్‌దారులకు చేయూత పెన్షన్ పత్రాలు అందించిన...**
- **పైనంపల్లి గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ కుక్కల నరేష్**



ఖమ్మం / నవంబర్ 13 (అక్షరం న్యూస్)

నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి గ్రామ చేయూత పెన్షన్‌దారులకు పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. పైనంపల్లి గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ కుక్కల నరేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో మండల నాయకులు యడవల్లి సైదులు, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యడవల్లి నాగరాజు పైనంపల్లి మాజీ సొసైటీ చైర్మన్ నల్లని మల్లికార్జునరావు పాల్గొని అర్హులైన పెన్షన్‌దారులకు చేయూత పెన్షన్ పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా నాయకులు పెన్షన్‌దారులతో మాట్లాడి వారి సంక్షేమానికి సంబంధించిన సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం వృద్ధులు, అర్హులైన లబ్ధిదారుల జీవనానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, సైదులు, మస్తాన్, స్థానిక నాయకులు, ప్రజలు, మహిళలు, పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం..రైతుకు రూ.80 వేల నష్టం



హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి / నవంబర్ 13 /అక్షరం న్యూస్:

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమై రైతుకు తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన భీమదేవరపల్లి మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు వెంటనే సర్పంచి మాచర్ల కుమారస్వామికి సమాచారం అందించడంతో ఆయన స్పందించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే సాయంత్రం 5 గంటలకు సమాచారం అందించినప్పటికీ రాత్రి 8 గంటల వరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకోలేదని సర్పంచి ఆవేదన వ్యక్తం చేశారు.స్థానికులు పోలు అశోక్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బండి రాజయ్య తన పాడి పశువుల కోసం వ్యవసాయ బావిల దారి సమీపంలోని బండపై గడ్డివామును ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివాముకు మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. గమనించిన గ్రామస్థులు వెంటనే మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

ఈ ప్రమాదంలో సుమారు రూ.80 వేల విలువైన గడ్డి దగ్ధమైందని బాధిత రైతు బండి రాజయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. పాడి పశువుల మేత కోసం నిల్వ చేసుకున్న గడ్డి అగ్నికి ఆహుతి కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపాడు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందించినా అగ్నిమాపక శాఖ సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి బాధిత రైతుకు నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మైనర్ డ్రైవింగ్‌కు చెక్.. పోలీసుల ప్రత్యేక తనిఖీలు

- **18 ఏళ్లు నిండని వారికి వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ఎస్‌హెచ్‌ఓ సాయి కిషోర్ రెడ్డి**



భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / నవంబర్ 13 / అక్షరం న్యూస్ :అశ్వారావుపేట పట్టణంలో మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. చిన్నారులకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణం కావద్దని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌హెచ్‌ఓ సాయి కిషోర్ రెడ్డి సూచించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

18 ఏళ్లు నిండని పిల్లలకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌ఓ హెచ్చరించారు.

పత్రాలు తప్పనిసరి

ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), ఇన్సూరెన్స్ పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలపై పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు సుమారు 10 కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. వాహనదారులు బాధ్యతగా వ్యవహరించి రోడ్డు భద్రతకు సహకరించాలని కోరారు.

లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...వొడితల ప్రణవ్...

- వీణవంక మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశానికి హాజరైన ప్రణవ్..
- కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమానికి కౌశిక్ రెడ్డి హాజరవ్వడం పై ప్రణవ్ ఆసక్తికర వ్యాఖ్యలు..



కరీంనగర్/వీణవంక/నవంబర్ 13/అక్షరం న్యూస్:

పదేళ్లలో రాష్ట్రంలో ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం ఇవ్వకుండా ఆపిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల్లో ప్రధానంగా ఇందిరమ్మ ఇంటి హామీని నెరవేరుస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఇంటిని కేటాయిస్తూ సొంతింటి కలను నెరవేరుస్తూ వారి కళ్లలో ఆనందం చూస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం రోజున వీణవంక మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుని నూతన గృహ ప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గత 30 సంవత్సరాలుగా సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్నామని,ఆ కలను నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంచార్జి వొడితల ప్రణవ్ మాకు ఇందిరమ్మ ఇంటిని కేటాయించి ఆర్థిక భరోసా కల్పించారని ఇప్పుడు కొత్త ఇంటిలోకి గృహప్రవేశం చేస్తుంటే ఆనందానికి అవధులు లేవని లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎక్కడా అని ప్రశ్నించే కౌశిక్ రెడ్డి ఈ రోజు తను రిబ్బన్ కట్ చేసిన ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని,ఇందిరమ్మ ఇళ్ల రిబ్బన్ కట్ చేసే సమయంలో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కౌశిక్ రెడ్డి చూడాలని కోరారు.పదేళ్ల పాటు హుజురాబాద్ నియోజకవర్గంలో ఒక్క ఇళ్లు కూడా కేటాయించకుండా లబ్ధిదారులను మభ్య పెట్టారని అన్నారు.మొదటి విడతతో పాటు రెండవ విడతలో మరిన్ని ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,మండల అధ్యక్షుడు,మైనారిటీ నాయకులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత విద్యాసంస్థలే లక్ష్యం -- డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



సూర్యాపేట/నేరేడుచర్ల, నవంబర్ 13: అక్షరం న్యూస్

నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం డాగ్ స్క్వాడ్ సహాయంతో యాంటీ డ్రగ్స్ తనిఖీలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణం, తరగతి గదులు, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించి, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ రహిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

దీప్తి కిడ్స్ కార్నర్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పీటీఎస్ కాలనీలోని దీప్తి కిడ్స్ కార్నర్‌లో శుక్రవారం చిన్నారుల ఆటపాటల నడుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు తాజిన్ జావేద్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అభినందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయాలని, వారితో ప్రేమాభిమానాలతో మెలుగుతూ సరైన విద్యను అందించాలని సూచించారు. చిన్నారుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు.అనంతరం చిన్నారులు ప్రదర్శించిన ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దీప్తి కిడ్స్ కార్నర్ ఇన్‌చార్జి చైనా దత్త, దీప్తి మహిళా సమితి సీనియర్ సభ్యురాలు, ఇతర కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు వేదికల నిర్వహణకు తలలు పట్టుకుంటున్న సిబ్బంది

- ఏళ్లుగా మెయింటెనెన్స్ నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- రైతు నేస్తం ఖర్చులు భరించలేక విసిగిపోతున్న అధికారులు
- రైతు నేస్తం సహా అన్ని శాఖల కార్యక్రమాలకు రైతు వేదికలే దిక్కు
- నిర్వహణకు ఇబ్బందులు " ఏఈవోల జేబు నుంచి ఖర్చు.. ఆర్థికంగా సతమతం
- విద్యుత్ బిల్లుల చెల్లింపులకూ తిప్పలే
- నెలవారి అంచనా ప్రకారం నాలుగేళ్లుగా 117.045 కోట్ల రూపాయలు పెండింగ్

ఖమ్మం/ టౌన్ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

రైతులకు సలహాలు, సూచనలు అందించాల్సిన రైతు వేదికలు వ్యవసాయ విస్తరణ అధికారు లకు (ఏఈఓలు) ఆర్థిక భారంగా మారుతున్నాయి. రైతుల సమావే శాలు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ప్రభుత్వ పథకాల అమలుకు వేదికలుగా ఉపయోగపడుతున్నా.. వాటి నిర్వహణకు నిధులు అందడం లేదు. విద్యుత్ బిల్లులు చెల్లింపులు మొదలుకొని తాగునీరు, పారిశుద్ధ్యం, స్టేష నరీ, జిరాక్సు, మీటింగులకు, చిన్నపాటి మరమ్మత్తుల వరకు ఖర్చుల భారం సిబ్బందిపైనే పడుతోంది. నాలుగే ళ్లుగా నిధులు నిలిచిపోవడంతో ఏఈఓలు సొంత డబ్బుతో రైతు వేదికలను నెట్టుకొస్తు న్నారు. రైతువేదికల నిర్వహణకు గత ప్రభుత్వ హయాంలోనే నెలకు రూ.3 వేల చొప్పున అందేవి. అనంతరం వ్యవసాయ శాఖ విజ్ఞప్తి మేరకు రూ.9 వేలకు పెంచారు. నిర్వహణ నిధులను 2022 ఏప్రిల్ నుంచి 2022 ఆగస్టు వరకు అంటే కేవలం ఐదు నెలలకు సంబంధించి నవి మాత్రమే విడుదల చేశారు. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. నెలకు రూ.9 వేల చొప్పున 2022 సెప్టెంబర్ నుంచి 2026 అక్టోబర్ వరకు 50 నెలల నిర్వహణ వ్యయాన్ని లెక్కిస్తే ఒక్కో రైతు వేదికకు రూ.4.50 లక్షల వరకు ఖర్చు అవుతుంది. రాష్ట్రంలోని 2,601 రైతు వేదిక లకు మొత్తం రూ.117.045 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా రైతు వేది కల విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటు అంశం కూడా తెరపైకి వచ్చింది. ఒక్కో రైతు వేది కపై 3 కిలో వాట్ల సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉంది. అంతకు ముందే 2025 ఫిబ్రవరిలో తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని రెండు రైతువేదికల వద్ద 10 కిలో వాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచింది. ఆ తర్వాత మిగతా రైతు వేదికల్లోనూ సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆ ప్రస్తావనే లేదన్న విమర్శలున్నాయి.



ప్రభుత్వ కార్యక్రమాలన్నీ రైతు వేదికల్లోనే..

రైతువేదికలు కేవలం వ్యవసాయ శాఖ నిర్వహించే కార్యక్రమాలకే పరిమితం కాకుండా ఇతర ప్రభుత్వ కార్యక్ర మాలకు కూడా ఉపయోగపడుతున్నాయి. కళ్యాణలక్ష్మిచెక్కుల పంపిణీ, శిక్షణ, వివిధ శాఖల సమావేశాలు, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి, ఫిర్యాదుల స్వీకరణ వంటి కార్య క్రమాలకూ రైతు వేదికలనే ఉపయోగి స్తున్నారు. అన్ని శాఖల కార్యక్రమాలకు అందుబాటులో ఉంటున్నప్పటికీ వాటి నిర్వ హణకు నిధులు మాత్రం అందడం లేదు. కార్యక్రమాల నిర్వహణకు రైతువేదికలను వినియోగించుకునే ఇతర శాఖలు సైతం నిర్వహణ ఖర్చుల విషయంలో బాధ్యత తీసుకోకపోవడం సమస్యను మరింత పెంచుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మంగళవారం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఒక్కో వేదికకు సుమారు 30 నుంచి 60 మంది రైతులు హాజరవుతు న్నారు. ఇందుకు గాను విద్యుత్ భారం పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.

నిధులు విడుదల చేయాలని వినతులు

రైతు వేదికల నిర్వహణకు సంబంధించి పెండింగ్ నిధులను విడుదల చేయడంతో పాటు ప్రతి వేదికకు నెలవారీ నిర్వహణ మొత్తాన్ని సకాలంలో అందించాలని ఏఈ ఓలు కోరుతున్నారు. రైతునేస్తం వంటి కార్యక్రమాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించా లని, రైతులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు అటెండర్లను నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులకు సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతువేదికల నిర్వహణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందిపై మోపడం సమం జనం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదలు విడుదల చేయాలని ఏఈఓలు,రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్హులందరికీ "చేయూత"నిస్తాం..అండగా నిలుస్తాం..

- గత ప్రభుత్వ హయాంలో..పేదలు కాళ్లరిగేలా తిరిగినా, కళ్ళు కాయలు కాసేలా చూసినా కనికరించలేదు
- దీపావళి నాడు తీపి కబురు చెప్పాం..
- ఇప్పుడు పల్లెల్లో పింఛన్ల పండుగ తీసుకొచ్చాం..
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- నేలకొండపల్లిలో 1,138 మంది నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ ..

ఖమ్మం/ టౌన్ నవంబర్ 13 (అక్షరం న్యూస్)

నేలకొండపల్లి: ఒంటరి మహిళలు, వితంతువులు, గీత, చేనేత కార్మికుల కుటుంబాల్లో ఆర్థిక భరోసా అందించాలని గొప్ప సంకల్పంతో మన ప్రజా ప్రభుత్వం చేయూత పథకం ద్వారా అర్హులందరికీ అండగా నిలుస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నేలకొండపల్లిలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో చేయూత పథకం కింద నూతనంగా 1,138 మందికి పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలోని 8 ఏళ్లలో కొత్త పింఛన్లు అనేదే ఇవ్వలేదని, కాళ్ళరిగేలా తిరిగినా, కళ్ళు కాయలు కాసేలా ఏళ్లుగా ఎదురుచూసినా వారు చలించలేదని, ఎన్నికలకు ముందు తన పర్యటనల్లో పేదల గోస చూసి ఆవేదన చెందానని మన ప్రజా ప్రభుత్వం వచ్చాక.. కొత్తగా పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. దీపావళి పండుగ రోజున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి ఇవ్వబోతున్నట్లు ప్రకటించి.. ఆచరణలోకి తెచ్చామని అన్నారు. గత పాలకులు కమీషన్ల కోసం లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టి.. కూలేశ్వరంగా మిగి ల్చారని విమర్శించారు. ఇంకా అర్హులు ఉంటే.. కచ్చితంగా పింఛన్లు మంజూరు చేసి అండగా నిలుస్తామని, ఎవరూ అధైర్య పడొద్దని అభయమిచ్చారు.

నేల కొండపల్లి మండలంలో 1,138 మందికి కొత్త పింఛన్లు..



నెలకు రూ.30.16 లక్షల మేర ఆర్థిక భరోసా

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పథకం ద్వారా నేలకొండపల్లి మండలంలో కొత్తగా 1,138 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. వీరికి ప్రతినెలా మొత్తం రూ.30,16,208 పింఛను రూపంలో అందనుంది. నవంబర్ 13, 2026 నాటికి మండలంలో మంజూరైన కొత్త పింఛన్ల వివరాలను అధికారులు వెల్లడించారు.

వర్గాల వారీగా వివరాలు ఇలా..

దివ్యాంగులు -- 361 మందిలి (నెలకు రూ.14,49,776)
ఒంటరి మహిళలు -- 107 మంది (రూ.2,15,712)
గీత కార్మికులు -- 64 మంది(రూ.1,29,024)
చేనేత కార్మికులు -- ఇద్దరు(రూ.4,032)
వితంతువులు -- 604 మంది(రూ.12,17,664)

మొత్తంగా 1,138 మందికి నెలకు రూ.30.16 లక్షలకుపైగా పింఛన్ల రూపంలో ఆర్థిక సహాయం అందనుంది. దివ్యాంగులకు ఒక్కొక్కరికీ నెలకు రూ.4,016, మిగిలిన వర్గాలకు రూ.2,016 చొప్పున పింఛను మంజూరైనట్లు అధికారులు తెలిపారు. పాత పింఛన్లతో కలుపుకొని మొత్తం 9,428 మందికి నెలకు రూ.1,64,40,896 లబ్ధి చేకూరుతోందని వివరించారు.

ఈ కార్యక్రమంలో..: అడిషనల్ కలెక్టర్ శ్రీజ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కొడాలి గోవిందరావు, సీనియర్ నాయకులు శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు బొడ్డు బొందయ్య, పలువురు సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, ప్రజా ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్థలు

- వెంటనే మౌలిక వసతులు కల్పించాలి : పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్

కరీంనగర్/జమ్మికుంట/, నవంబర్ 13/అక్షరం న్యూస్: జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ముఖ్యంగా మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలకు ఒకే ఒక మరుగుదొడ్డి ఉండగా, బాలురకు కళాశాల ఆవరణలో సరైన మరుగుదొడ్డి సౌకర్యం లేక బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా తాగునీటి సౌకర్యం సక్రమంగా లేకపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు.విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కళాశాలకు ప్రత్యేక నిధులు కేటాయించి మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకిని మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెల్దిరాజు, యశ్వంత్, రామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్...

జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)నవంబరు 13 : మండలంలోని ఖిలాషాపూర్, జాఫరగూడెం పంచాయతీ కార్యదర్శులు ఇల్లెందుల సురేందర్ బాబు, బండ మధును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఖిలాషాపూర్, జాఫరగూడెం గ్రామాలలో ఎంపీడీవో కావ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించి పంచాయతీ రికార్డులను పరిశీలించగా, ఆయా గ్రామాలలో వసూలైన ఇంటి, నల్లా పన్నులకు సంబంధించిన డబ్బులను సకాలంలో ఎన్టీవోలో జమ చేయలేదని తేలింది. దీంతో ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల పని తీరుపై ఎంపీడీవో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ములకలపల్లి మండలంలో కలకలం...

కళాశాలకు వెళ్లి అదృశ్యమైన ఇంటర్ విద్యార్థిని

- **జగన్నాధపురం వద్ద బస్సు దిగిన బాలిక... ఆందోళనలో కుటుంబ సభ్యులు**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ములకలపల్లి పోలీసులు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /నవంబర్ 13/అక్షరం న్యూస్:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో ఓ ఇంటర్మీడియట్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సకాలంలో ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

స్థానిక వివరాల ప్రకారం.. ములకలపల్లి మండలం కొత్త గంగారం గ్రామానికి చెందిన గీగ జ్యోతి–వసంతరావు దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు అజయ్ (18) కాగా, కుమార్తె అనూష (16) ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది.గత సోమవారం (నవంబర్ 10న) ఉదయం సుమారు 08:00 గంటలకు అనూష ఎప్పటిలాగే తన స్నేహితులతో కలిసి ఆర్టీసీ బస్సులో కళాశాలకు బయలుదేరి వెళ్ళింది. సాయంత్రం కళాశాల సమయం ముగిసిన తర్వాత స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన ఆమె, మార్గమధ్యలోని జగన్నాధపురం గ్రామం వద్ద బస్సు దిగినట్లు తోటి విద్యార్థినులు, స్నేహితులు ధృవీకరించారు. అయితే, రాత్రి అయినప్పటికీ అనూష ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది.తక్షణమే అప్రమత్తమైన తల్లిదండ్రులు మరియు బంధువులు జగన్నాధపురం గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద రాత్రంతా గాలించినప్పటికీ బాలిక ఆచూకీ లభించలేదు. ఎటూ పాలుపోని స్థితిలో తల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బస్సు దిగిన ప్రాంతంలోని సీసీటీవీ (ఫుటేజ్) పరిశీలనతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. విద్యార్థిని ఆచూకీకి సంబంధించి ఏవైనా సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

దుబ్బ మల్లన్న కళ్యాణ,జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన వొడితల ప్రణవ్..



కరీంనగర్/జమ్మికుంట/నంబర్ 13/అక్షరం న్యూస్:

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో వచ్చే నెల నుండి జరిగే మల్లికార్జున స్వామి కళ్యాణం,జాతరకు సంబంధించి పోస్టర్ ను ప్రణవ్ ఆవిష్కరించారు.ఎంతో మహిమ కలిగిన ఈ ఆలయంలో జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని,జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేయాలని కమిటీని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దుబ్బ మల్లన్న చైర్మెన్ రవీందర్,కౌన్సిలర్లు,కమిటీ సభ్యులు,ఆలయ అర్చకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

16 ఏళ్ల అనుబంధానికి కన్నీటి వీడ్కోలు..

మూగజీవికి ఘనంగా దహన సంస్కారాలు

- **మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన టి.టి.ఎస్. కాలనీవాసులు**



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : మనుషుల మధ్యనే కాదు.. మనుషులకు, మూగజీవులకు మధ్య కూడా ఆప్యాయతానుబంధాలు ఉంటాయని ఎన్టీపీసీ టెంపరరీ టౌన్షిప్ కాలనీవాసులు నిరూపించారు. సుమారు 16 ఏళ్లుగా కాలనీలోని ప్రతి ఇంటి వద్ద ఆప్యాయంగా తిరుగుతూ, అందరికీ చేరువైన 'రాజు' అనే మూగజీవి కుక్క అనారోగ్యంతో మృతి చెందడంతో కాలనీవాసులు కన్నీటి వీడ్కోలు పలికారు. పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు సంప్రదాయబద్ధంగా దహన సంస్కారాలు నిర్వహించి తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు.దాదాపు 16 ఏళ్లుగా టి.టి.ఎస్ లో ప్రతి ఒక్కరితో స్నేహంగా మెలుగుతూ, కాలనీలో ఒక కుటుంబ సభ్యుడిలా మెలిగిన ఈ కుక్కకు స్థానికులు ప్రేమతో 'రాజు' అని పేరు పెట్టుకున్నారు. రోజూ కాలనీలోని ఇళ్ల వద్దకు వెళ్తూ అందరి ఆదరాభిమానాలను పొందేది. రాజు అనారోగ్యానికి గురైన ప్రతిసారీ స్థానిక కాంట్రాక్టర్ ఏబీసీ రెడ్డి, కిషోర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పశువైద్యులచే చికిత్స చేయించేవారు.ఈ క్రమంలో శుక్రవారం రాజు మృతి చెందడంతో కాలనీవాసులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. స్థానిక కాంట్రాక్టర్లు ఏబీసీ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజా కిషన్ రావు, పేరం రమేష్, రమణారెడ్డి, ప్రభాకర్ తదితరులు రాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అందరూ కలిసి దహన సంస్కారాలు నిర్వహించారు. సాధారణంగా మనుషుల మధ్య ఉండే అనుబంధాలను కూడా మరచిపోతున్న ఈ రోజుల్లో, 16 ఏళ్ల పాటు తమతో కలిసి జీవించిన ఒక మూగజీవి పట్ల కాలనీవాసులు చూపిన ప్రేమ, కరుణ, ఆప్యాయత పలువురిని కదిలించాయి. మాటలు రాని జీవి అయినప్పటికీ దాని పట్ల చూపిన అభిమానం, చివరి ప్రయాణంలో అందరూ కలిసి వీడ్కోలు పలికిన తీరు మానవత్వానికి అద్దం పడుతోందని స్థానికులు అభిప్రాయపడ్డారు. మూగజీవాల పట్ల ప్రేమ, జీవులన్నింటి పట్ల కరుణ కలిగి ఉండాలనే గొప్ప సందేశాన్ని ఈ ఘటన సమాజానికి అందించింది.

దక్షిణ భారతదేశానికి వెలుగుల విరజిమ్ముతున్న

రామగుండం ఎన్టిపిసి ఆవిర్భవించి 48 సంవత్సరాలు..

- **నేడు రైజింగ్ డే**



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :

దక్షిణ భారతదేశానికి విద్యుత్ వెలుగులు అందిస్తున్న రామగుండం ఎన్టీపీసీ ప్రస్థానం విజయవంతంగా కొనసాగుతోంది. ఒకప్పుడు తుమ్మ చెట్లు, ముళ్ల పొదలతో నిర్మానుష్యంగా కనిపించిన ఈ ప్రాంతం నేడు అందమైన టౌన్షిప్‌గా, వేలాది కుటుంబాలకు నివాస కేంద్రంగా, పారిశ్రామిక ప్రగతికి చిరునామాగా రూపాంతరం చెందింది. దాదాపు ఐదు దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఈ విద్యుత్ ప్రాజెక్టు జైత్రయాత్రలో ఎన్నో మైలురాళ్లు నమోదయ్యాయి.దేశ విద్యుత్ అవసరాలను తీర్చాలనే లక్ష్యంతో 1975 నవంబర్ 7న ఎన్టీపీసీ సంస్థ ఆవిర్భవించింది. ఇందులో భాగంగా దక్షిణ భారతదేశానికి విద్యుత్ అందించేందుకు రామగుండంలో భారీ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 1978 నవంబర్ 14న అప్పటి ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో కరీంనగర్ జిల్లా పరిధిలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నేడు పెద్దపల్లి జిల్లాకు ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది.

ఏడు యూనిట్లు.. 2,600 మెగావాట్ల సామర్థ్యం

తొలుత 200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లను ఏర్పాటు చేశారు. అనంతరం 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో మూడు యూనిట్లను ప్రారంభించారు. 2004లో ఏడో యూనిట్‌గా మరో 500 మెగావాట్ల యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దీంతో మొత్తం ఏడు యూనిట్ల ద్వారా 2,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఏర్పడింది. జాతీయ విద్యుత్ గ్రిడ్ ద్వారా దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ అవసరాలకు ఈ కేంద్రం తన వంతు సహకారం అందిస్తోంది.

బొగ్గు, నీటితో నిరంతర విద్యుత్ ఉత్పత్తి

విద్యుత్ కేంద్రానికి అవసరమైన బొగ్గును ప్రధానంగా సింగరేణి బొగ్గు గనుల నుంచి సరఫరా చేస్తున్నారు. ఏడో యూనిట్‌కు ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి కూడా బొగ్గు అందుతోంది. పూర్తి సామర్థ్య వినియోగం ఆధారంగా రోజుకు సుమారు 35 వేల నుంచి 36 వేల టన్నుల బొగ్గు అవసరమయ్యే స్థాయి ఈ ప్రాజెక్టుది. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటిని గోదావరి నదిపై ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి తరలిస్తున్నారు. ఎన్టీపీసీ పరిధిలోని భారీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా నీటిని అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తున్నారు.

బూడిద నిర్వహణలో ప్రత్యేక వ్యవస్థ

బొగ్గు దహనం వల్ల వెలువడే బూడిదను నిల్వ చేసేందుకు కుందనపల్లి సమీపంలో సుమారు 1,500 ఎకరాల విస్తీర్ణంలో నాలుగు లగూన్లతో యాష్‌పాండ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే బూడిదను నిల్వ చేయడానికే పరిమితం కాకుండా సిమెంట్ పరిశ్రమలు, ఇటుకల తయారీ, రహదారుల నిర్మాణం తదితర అవసరాలకు వినియోగిస్తున్నారు. 2024--25లో 42.07 లక్షల టన్నుల బూడిద ఉత్పత్తి కాగా, గతంలో నిల్వ ఉన్న బూడిదతో కలిపి 52.30 లక్షల టన్నులను వినియోగించడం విశేషం. దీంతో బూడిద వినియోగం 124.32 శాతానికి చేరింది.

పర్యావరణం, భద్రతకు ప్రాధాన్యం

బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రం అయినప్పటికీ పర్యావరణ పరిరక్షణకు ఎన్టీపీసీ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. కాలుష్య నియంత్రణ, నీటి పొదుపు, మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధి, బూడిద సద్వినియోగానికి ప్రాధాన్యత ఇస్తోంది. 100 మెగావాట్ల తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా పునరుత్పాదక ఇంధన రంగంలోనూ తనదైన ముద్ర వేసింది.అదేవిధంగా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల భద్రత కోసం శిక్షణ కార్యక్రమాలు, అగ్నిమాపక విన్యాసాలు, ప్రమాదాల నివారణ చర్యలు నిరంతరం నిర్వహిస్తున్నారు. ఇంధన సామర్థ్యం, పర్యావరణ నిర్వహణ రంగాల్లో పలు జాతీయ స్థాయి పురస్కారాలను అందుకుంది.

సామాజిక సేవలోనూ ముందంజ


విద్యుత్ ఉత్పత్తితోపాటు పరిసర గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా సహకరిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు, బాలికల వసతి గృహాలకు సహాయం, వైద్య పరికరాల అందజేత, తాగునీటి సదుపాయాలు, మహిళలకు ఉపాధి శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

తెలంగాణ విద్యుత్ రంగానికి మరో బలం

ఇదే ప్రాంగణంలో తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టును కూడా నిర్మించారు. మొదటి దశలో 800 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లతో 1,600 మెగావాట్ల సామర్థ్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో రామగుండం విద్యుత్ కేంద్రాల సముదాయం తెలంగాణ విద్యుత్ అవసరాలకు మరింత బలంగా నిలుస్తోంది.ఒకప్పుడు అడవులు, ముళ్ల పొదలతో కనిపించిన ప్రాంతాన్ని ఆధునిక టౌన్షిప్‌గా తీర్చిదిద్ది, వేలాది మందికి ఉపాధి కల్పించి, దేశ విద్యుత్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన రామగుండం ఎన్టీపీసీ ప్రస్థానం నిజంగా స్ఫూర్తిదాయకం. ఈ విజయాల వెనుక ఉద్యోగులు, ఇంజినీర్లు, కార్మికులు, వారి కుటుంబాల కృషి ఉంది. కాలంతోపాటు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విద్యుత్ ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ ఈ విద్యుత్ కేంద్రం జైత్రయాత్ర కొనసాగాలని ఆకాంక్షిద్దాం.

తల్లిదండ్రుల మధ్య నలిగిపోయే పిల్లల భావోద్వేగాలకు అద్దం పట్టే లఘు చిత్రం

- **'నా పెండ్లికి ఎవరు? అమ్మానాన్నలా?' మినీ మూవీ ఆవిష్కరణ**



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 13 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్:

కరోనా క్రియేషన్స్ బ్యానర్‌పై అమేజింగ్ స్టార్ అశోక్ వేముల స్వీయ రచన, కథ, మాటలు, స్క్రీన్‌ప్లేతో నిర్మించిన 'నా పెండ్లికి ఎవరు? అమ్మానాన్నలా?' అనే లఘు చిత్రాన్ని పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకుడు రాజిరెడ్డి, యువరత్న వేల్పూర్ సొసైటీ అధ్యక్షుడు తిరుపతి, న్యూ ఇండియా పార్టీ అధ్యక్షుడు జె.వి. రాజు, సీనియర్ దర్శకులు దామెర శంకర్, నదులు కన్నం రమేష్, పల్లెర్ల జగన్, కంది నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై చిత్రాన్ని విడుదల చేశారు.తల్లిదండ్రులు విడిపోయినప్పుడు వారి మధ్య నలిగిపోయే పిల్లల మనోవేదన, భావోద్వేగాలను ఈ చిత్రం ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కించారు. కుటుంబాన్ని విడిచి వెళ్లిన తల్లి, తండ్రి సంరక్షణలో పెరిగిన కుమార్తె పెళ్లి సమయంలో తిరిగి ఎదురుపడటం, తన జీవితంలో తల్లిదండ్రులిద్దరికీ సమాన స్థానం ఉండాలని ఆ కుమార్తె కోరుకోవడం వంటి సున్నితమైన అంశాలను ఈ చిత్రంలో ఆవిష్కరించారు. కుటుంబ బంధాల విలువను, పిల్లల మనసులో తల్లిదండ్రులిద్దరికీ ఉండే ప్రత్యేక స్థానాన్ని ఈ కథ ప్రతిబింబిస్తుందని అతిథులు పేర్కొన్నారు.ఈ చిత్రానికి పున్నిపాదం దర్శకత్వం వహించగా, ఫైవ్ స్టార్ ఎం.డి. ఛాయాగ్రహణం, అంజిబాబు మేకప్, అప్రోజ్ నిర్మాణ బాధ్యతలు నిర్వహించారు. అమేజింగ్ స్టార్ అశోక్ వేముల, రాధిక, శ్రీదేవి, లక్ష్మి కళ, బేబీ సగ్నిక, చంద్రమౌళి, అంగడి రమేష్, మూల శంకర్ తదితరులు నటించారు.సామాజిక సందేశంతో రూపొందించిన ఈ లఘు చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందాలని, చిత్ర బృందానికి మంచి గుర్తింపు రావాలని అతిథులు ఆకాంక్షించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించిన ఇల్లందకుంట పోలీసులు

- **సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను గుర్తించిన పోలీసులు**

కరీంనగర్/ఇల్లందకుంట/, నవంబర్ 13/అక్షరం న్యూస్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి బాధితుడికి అప్ప గించినట్లు ఇల్లంద కుంట పోలీసులు తెలిపారు. బూజు నూరు గ్రామానికి చెందిన చీపాటి శ్రీకాంత్ గత నెల 13వ తేదీన తన రెడ్‌మీ 9 మొబైల్ ఫోన్ను పోగొట్టుకున్నారు. ఈ విషయంపై ఆయన ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మొబైల్ ఫోన్‌ను గుర్తించిన పోలీసులు శుక్రవారం బాధితుడు చీపాటి శ్రీకాంత్‌కు ఫోన్‌ను తిరిగి అప్పగించారు. పోగొట్టుకున్న ఫోన్ తిరిగి లభించడంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎవరైనా మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లయితే ఆందోళన చెందకుండా వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేసి, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

- **అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య**

జమ్మి కుంట: జమ్మికుంట పట్టణంలోని 16వ వార్డు జైభీమ్ కాలనీకి చెందిన పుల్లూరి శ్యామ్‌మూర్తి (34) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లూరి రాధమ్మ, కొము రయ్య దంపతుల రెండో కుమారు డైన శ్యామ్‌మూర్తి ఈ నెల 10వ తేదీన ఉదయం పనికి వెళ్లి సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. అనంతరం ఇంటి బయట కూర్చుని తన తల్లిని పిలిచి గడ్డి మందు తాగినట్లు తెలిపి, మందు డబ్బాను చూపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి, అనంతరం హనుమకొండలోని ఓజస్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.అయితే చికిత్స పొందుతూ నవంబర్ 13వ తేదీ శుక్రవారం ఉదయం శ్యామ్‌మూర్తి మృతి చెందాడు. మృతుడు గత కొంతకాలంగా అల్సర్ నొప్పితో బాధపడుతూ మందులు వాడుతున్నాడని, అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగి ఉంటాడని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నేడు ఎన్టీపీసీ రామగుండం 49వ ఆవిర్భావ దినోత్సవం .. మాజీ ఉన్నతాధికారుల రాక

జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: ఎన్టీపీసీ రామగుండం 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థలో గతంలో కీలక బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉన్నతాధికారులతో ప్రత్యేక అనుభవాల పంచుకునే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ మానవ వనరుల విభాగం శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది.ఈ నెల 14వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు రామగుండంలోని కాకతీయ హాలులో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ రామగుండంలో గతంలో ప్రాజెక్టు అధిపతులుగా పనిచేసి, అనంతరం సంస్థ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ పొందిన ప్రముఖులు పాల్గొననున్నారు.మాజీ డైరెక్టర్ (టెక్నికల్), రామగుండం మాజీ ప్రాజెక్టు అధిపతి పి.కె. మొహపాత్ర, మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రామగుండం మాజీ ప్రాజెక్టు అధిపతి వై.వి. రావు, మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఈ. సత్య ఫణికుమార్, ఎ.కె. మనోహర్, రవీంద్ర కుమార్, సునీల్ కుమార్ అనుభవాలను పంచుకోనున్నారు.సంస్థ అభివృద్ధిలో తమ అనుభవంతో పాటు నాయకత్వ విలువలు, విధి నిర్వహణలో అనుసరించిన ఉత్తమ పద్ధతులు, ఎదురైన సవాళ్లు, సాధించిన విజయాలను వారు ఉద్యోగులతో పంచుకోనున్నారు. సుదీర్ఘ అనుభవం కలిగిన మాజీ ఉన్నతాధికారులతో నేరుగా మాట్లాడే ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మానవ వనరుల విభాగం కోరింది.ఈ మేరకు ఎన్టీపీసీ సీనియర్ మేనేజర్ (మానవ వనరులు) పంకజ్ వశిష్ఠ సర్క్యులర్ జారీ చేశారు.

దయాదాక్షిణ్యాలు వద్దు.. రాజ్యాంగ హక్కులు కావాలి!

- **ఏజెన్సీ ఎస్సీలకు ప్రత్యేక అభివృద్ధి మండలి ఏర్పాటు చేయాలి**
- **ఇందిరాపార్క్ ధర్నాలో డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్**

జ్యోతి నగర్ ఎన్టిపిసి , నవంబర్ 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్,:

ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న షెడ్యూల్డ్ కులాల ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తక్షణమే అమలు చేయాలని ఏజెన్సీ షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్, సమత సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. భూమి, విద్య, వైద్యం, ఉపాధి, గృహవసతి, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు ప్రత్యేక ఏజెన్సీ ఎస్సీ అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు.విశ్రాంత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, దక్షిణ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్‌లతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులను గౌరవిస్తూనే అక్కడ నివసిస్తున్న అర్హులైన ఎస్సీలకు సామాజిక న్యాయం కల్పించాలని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేక వసతి గృహాలు, స్కాలర్‌షిప్‌లు, ఉచిత పోటీ పరీక్షల శిక్షణ అందించాలని కోరారు. ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. నేతకాని మహర్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తేనే ఆ వర్గ సమస్యలను బలంగా వినిపించి పరిష్కార దిశగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ చైతన్యం, ఐక్యత, ప్రాతినిధ్యం అవసరమని పేర్కొన్నారు.డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ మాట్లాడుతూ.. ఏజెన్సీ దళితులకు దయాదాక్షిణ్యాలు అవసరం లేదని, రాజ్యాంగ హక్కులు అమలు కావాలని స్పష్టం చేశారు. భూమిలేని కుటుంబాలకు సాగు భూములు, గృహస్థలాలు కేటాయించాలని, 1958 నుంచి 1974 వరకు జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల అసలు ప్రతులను బహిర్గతం చేసి, అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక అభివృద్ధి మండలితోపాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ ఉద్యమం గిరిజనులకు వ్యతిరేకం కాదని, ఏజెన్సీ దళితుల రాజ్యాంగ హక్కులు, సామాజిక న్యాయం కోసమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులకు నేతకాని హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జనగాం నరేష్ తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లో ముద్రించిన మహనీయుల జయంతి ఉత్సవాల సంచిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ ధర్నాలో మాసాడే లక్ష్మీనారాయణ, కొత్తపల్లి గంగేష్, జనగాం నరేష్, ప్రొఫెసర్ జాడి మురళీధర్, టేకుమట్ల సంజయ్, ముడిమడుగుల సురేష్, జాడి రాజేష్ వర్మ, దుర్గం ప్రేమ్ కుమార్, గోపాల్, అనపర్తి యువరాజు, దుర్గం సంతోష్, కుమ్మరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : సింగరేణి కాలరీస్ హైస్కూల్ సెక్టార్--2లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ--1 ఏరియా సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి. హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హనుమంతరావు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, గీతాలాపనలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతోపాటు వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని హనుమంతరావు పేర్కొన్నారు.పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఆర్. విక్టోరియా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మి పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించండి

- **ప్రధానోపాధ్యాయురాలు పద్మ సర్పంచ్ సతీష్**




ఓదెల /నవంబర్ 13అక్షరం న్యూస్

మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించండని

బడికి రాని పిల్లల ఇంటికి వెళ్ళిన ఓదెల సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ ప్రధానోపాధ్యారాలు పద్మ గ్రామంలో బడికి సరిగా వెళ్లని విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పిల్లలను బడికి వెళ్ళే విధంగా సర్పంచ్ సతీష్ మరియు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ విద్యార్థుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు అన్ని రకాల సదుపాయాలు ఉదయం అల్పాహారం మధ్యాహ్న భోజనం పాలు గుడ్డు మరియు యూనిఫాం,పుస్తకాలు మంచి విద్యా బోధన చెప్పే గురువులను ఇచ్చినపుడు తల్లిదండ్రులు కూడా పిల్లలను రెగ్యులర్ గా పాఠశాలకు పంపించాలని చదువుకుంటేనే భవిష్యత్తు లో ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని విద్య లేని వాడు వింత పశువు గా మార్తాడని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ తో పాటు సర్పంచ్ పిల్లల తల్లిదండ్రులను పాల్గొన్నారు

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ దాసరి మమతారెడ్డి



ఓదెల / నవంబర్ 13అక్షర న్యూస్

ఓదెల మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు కనుకుంట్ల సాయిలు కుమార్తె నిశిక . వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ నాయకురాలు పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ దాసరి మమత రెడ్డి ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ నాయకులు మ్యాకల వెంకటేష్, గూడూరి కుమార్, కనుకుంట్ల శ్రీధర్, పిడుగు మల్లయ్య, కుమారస్వామి, కుమార్ , తదితరులు ఉన్నారు

డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు

- **అధికారులకు సన్మానం ఆంజనేయులు సాగర్**



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి: అంజయ్యనగర్ డివిజన్ పరిధిలోని సిద్ధికి నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా నూతన డ్రైనేజ్ పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.1 కోటి 20 లక్షల నిధులు మంజూరు చేయించడం పట్ల హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ జనరల్ మేనేజర్ హరిశంకర్ కి, డీజీఎం నరేందర్ రెడ్డి కి, మేనేజర్ విక్రమ్ రెడ్డి కి అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ, సిద్ధికినగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజ్ సమస్యపై ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి, ఉన్నతాధికారులతో చర్చించి రూ. 1. 20 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించిన జనరల్ మేనేజర్ హరిశంకర్ తో పాటు సంబంధిత అధికారుల చొరవ అభినందనీయమని ప్రశంసించారు. మంజూరైన నిధులతో పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, ఎలాంటి జాప్యం లేకుండా నూతన డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని, తద్వారా కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపి వారికి ఊరట కల్పించాలని అధికారులను కోరారు. ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి, సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవడం వల్ల ప్రజల్లో అధికారుల పట్ల విశ్వాసం పెరుగుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించిన అధికారులకు మంచి పేరు, గుర్తింపు లభిస్తాయని ఆంజనేయులు సాగర్ పేర్కొన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కి, జనరల్ మేనేజర్ హరిశంకర్ కి, డీజీఎం నరేందర్ రెడ్డి కి, మేనేజర్ విక్రమ్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధికి నగర్ నాయకులు రాజేందర్ రెడ్డి, వెంకట్, శ్రీనివాస్ రెడ్డి పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సుడిగాలి సుధీర్ మాస్ యాక్షన్ మెప్పించిందా?

బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, వెండితెరపై హీరోగా దూసుకుపోతున్న సుడిగాలి సుధీర్ నటించిన తాజా చిత్రం 'గోట్'. వేదవ్యాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దివ్యభారతి హీరోయిన్‌గా నటించింది. మహాతేజ క్రియేషన్స్, జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాతగా వ్యవహరించగా.. ఏషియన్ సినిమాస్ సమర్పించింది. భారీ అంచనాల మధ్య నవంబర్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఎలా ఉందో ఇప్పుడు పూర్తి సమీక్షలో చూద్దాం.



కథ

1983లో భారత్ క్రికెట్ ప్రపంచకప్ గెలిచిన నాటి నుంచి గోదావరి జిల్లాలోని రుద్రవరం గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ వేళ్లూనుకుంటుంది. ఆ గ్రామానికి పెద్దగా ఉన్న కృష్ణంరాజు (సర్వదమన్ బెనర్జీ) దీన్ని అడ్డుకోవాలని చూస్తాడు. కానీ, కాలక్రమేణా పరిస్థితులు మారి పదేళ్ల తర్వాత మొద్దు బాబ్జీ (నితిన్ ప్రసన్న) చైర్మన్‌గా ఎన్నికై ఈ క్రికెట్ బెట్టింగ్‌ను మరింత భారీ స్థాయిలో ప్రోత్సహిస్తాడు. ఈ జూదం మాయలో పడి ఎంతోమంది అమాయకులు తమ ప్రాణాలను, ఆస్తులను కోల్పోతుంటారు. మరోవైపు, విశాఖపట్నంలో ఉండే గణ అలియాస్ 'సార్' (సుడిగాలి సుధీర్) ఒక ఆవారా యువకుడు. డబ్బు కోసం ఒక అమ్మాయిని కిడ్నాప్ చేయాలని పథకం వేస్తాడు. అయితే అనుకోకుండా ఆ టార్గెట్ సుభాషిణి (దివ్యభారతి) రూపంలో అతడి చేతికి చిక్కుతుంది. సుభాషిణి పరిచయం తర్వాత గణ జీవితంలో ఎలాంటి ఊహించని మలుపులు తిరిగింది? క్రికెట్ బెట్టింగ్‌కు ప్రధానా కేంద్రంగా మారిన రుద్రవరం గ్రామానికి, గణకు ఉన్న సంబంధం ఏమిటి? డబ్బు కోసమే కిడ్నాప్ చేసిన అతడు, ఆ తర్వాత బెట్టింగ్ మాఫియాను ఎందుకు ఎదిరించాల్సి వచ్చింది? అతని ఫ్లాష్‌బ్యాక్ అసలు రహస్యం ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే సినిమా కథ.

విశ్లేషణ

గ్రామీణ నేపథ్యానికి క్రికెట్ బెట్టింగ్ మాఫియా కాన్సెప్ట్‌ను జోడించి దర్శకుడు వేదవ్యాస్ ఈ కథను తెరకెక్కించారు. యాక్షన్, కామెడీ, రొమాన్స్, ఎమోషన్ వంటి అన్ని కమర్షియల్ హంగులను సమపాళ్లలో మిళితం చేసే ప్రయత్నం చేశారు. దర్శకుడు ఎంచుకున్న ప్లాట్ పాయింట్ ఆసక్తికరంగా ఉన్నప్పటికీ, కథనం (స్క్రీన్‌ప్లే) విషయంలో మరింత పదును పెట్టి ఉంటే ఫలితం మరోలా ఉండేది. చాలా సన్నివేశాలు ఊహకందేలా సాగడం, ట్విస్టులు ముందే తెలిసిపోవడం చిత్రానికి కాస్త మైనస్‌గా మారాయి. అయినప్పటికీ, సినిమా ఫస్టాఫ్ పూర్తిగా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుంది. కిడ్నాప్ డ్రామా, హీరో-హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు, హీరో గ్యాంగ్ చేసే కామెడీ ప్రేక్షకులను నవ్విస్తాయి. హీరో గురించి ఒక ముఖ్యమైన నిజం హీరోయిన్‌కు తెలిసే కీలక సన్నివేశంతో ఇంటర్వెల్ బ్యాంగ్ పడుతుంది. ఇక ద్వితీయార్ధం (గ్రావిశీఅఽ ఱ్ఱశ్రీట) పూర్తిగా బెట్టింగ్ మాఫియాపై హీరో చేసే పోరాటం చుట్టూ తిరుగుతుంది. మాస్ ఎలిమెంట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లకు పెద్దపీట వేసినప్పటికీ, ఎమోషనల్ కనెక్షన్ సరిగ్గా కుదరలేదు. కొన్ని కీలక సన్నివేశాలను మరింత బలంగా రాసుకుని ఉంటే సినిమా స్థాయి మరింత పెరిగేది. అయినప్పటికీ, సుధీర్ అభిమానులకు మరియు విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ ఎంటర్‌టైనర్లను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుంది.

నటీనటులు

సుడిగాలి సుధీర్ తన ట్రేడ్‌మార్క్ కామెడీ టైమింగ్‌తో మరోసారి అలరించడమే కాకుండా, యాక్షన్ మరియు ఎమోషనల్ సన్నివేశాలలో తన పరిధి మేరకు మెప్పించారు. 'గణ' పాత్రలో ఆయన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. దివ్యభారతి సుభాషిణి పాత్రలో గ్లామర్‌తో పాటు నటన పరంగానూ ఆకట్టుకుంది. సుధీర్‌తో ఆమె కెమిస్ట్రీ బాగా కుదిరింది. నితిన్ ప్రసన్న విలన్‌గా తన క్రూరమైన నటనతో భయపెట్టాడు. విలనిజం సినిమాకు ప్రధాన హైలైట్లలో ఒకటిగా నిలిచింది. సర్వదమన్ బెనర్జీ, బ్రహ్మాజీ, 30 ఇయర్స్ పృథ్వీ, మొట్టె రాజేంద్రన్, చమ్మక్ చంద్ర తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. కొన్ని కామెడీ సీన్లలో వీరు నవ్వించారు.

సాంకేతికంగా

మణిశర్మ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ (దీ+వీ) సినిమా స్థాయిని నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లింది. మాస్ సీన్లలో ఆయన ఆర్ఆర్ అదుర్స్. లియోన్ జేమ్స్ అందించిన పాటలు పర్వాలేదనేలా ఉన్నాయి. గ్రామీణ వాతావరణాన్ని, విశాఖ అందాలను కెమెరామెన్ చక్కగా క్యాప్చర్ చేశారు. విజువల్స్ రిచ్‌గా ఉన్నాయి. ఎడిటింగ్ వర్క్ ఇంకాస్త క్రిస్పీగా ఉండాల్సింది. మహాతేజ క్రియేషన్స్, జైష్ణవ్ ప్రొడక్షన్స్ నిర్మాణ విలువలు చాలా ఉన్నతంగా, గ్రాండ్‌గా ఉన్నాయి.

బలాలు
సుడిగాలి సుధీర్ నటన ం కామెడీ టైమింగ్
మణిశర్మ నేపథ్య సంగీతం (దీ+వీ)
ఫస్ట్ హాఫ్ ఎంటర్‌టైన్‌మెంట్
ప్రొడక్షన్ వాల్యూస్

బలహీనతలు
ఊహకందే సాధారణ కథనం
సెకండాఫ్‌లో కొన్ని సాగదీత సన్నివేశాలు
బలహీనమైన ఎమోషనల్ కనెక్షన్

చివరిగా.. సుడిగాలి సుధీర్ తన ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను అలరించిన చిత్రం 'గోట్'. కామెడీ, యాక్షన్ మిక్స్ చేసిన ఈ సినిమా రెగ్యులర్ కమర్షియల్ మూవీస్ ఇష్టపడేవారికి నచ్చుతుంది.

కొత్త పోరడు హిట్ కొట్టాడా?

కొత్త హీరో అనీష్ నటించిన 'ఇట్లు అర్జున' ఈ మధ్యకాలంలో పరిశ్రమ దృష్టిని ఆకర్షించిన సినిమా. నాగార్జున లాంటి అగ్ర కథానాయకుడు సమర్పకుడిగా మారడం, దర్శకుడు వెంకీ కుడుముల ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరించడం, రామ్ చరణ్, ఎన్టీఆర్ లాంటి స్టార్లు కూడా ప్రమోషన్లలో భాగం పంచుకోవడంతో సినిమాపై క్రేజ్ పెరుగుతూ వచ్చింది. మరి ఈ హైప్‌ను సినిమా అందుకుందా? కొత్త హీరో అనీష్ నటన ఎలా ఉంది? రివ్యూలో చూద్దాం.



కథ:

అర్జున్ (అనీష్)కు మాటలు రావు. కానీ చాలా స్మార్ట్. చిన్నప్పుడు కొన్ని దొంగతనాలు చేయడంతో అతనిపై దొంగ అనే ముద్ర పడిపోతుంది. కీర్తి (అనస్వర రాజన్) అంటే అర్జున్‌కు ప్రాణం. తన మనసులోని ఫీలింగ్‌ను ఎలాగైనా సరే ఆమెకు చెప్పాలనుకుంటాడు. ఇదే సమయంలో పెద్దన్న (ముఖేష్ రుషి)కి సంబంధించిన వెయ్యి కోట్ల వ్యవహారంలో కీర్తి, అర్జున్ ఇద్దరూ అనుకోకుండా పాత్రధారులైపోతారు. ఆ తర్వాత ఏం జరిగింది? అర్జున్ తన మనసులోని మాటను కీర్తికి చెప్పగలిగాడా? ఈ హవాలా వ్యవహారానికి అర్జున్‌కు ఉన్న సంబంధం ఏమిటి? అనేదే మిగతా కథ.

విశ్లేషణ:

పాత కథను కొత్తగా చెప్పడం మంచి టెక్నిక్. అనుకోకుండా ఓ క్రైమ్‌లో హీరో చిక్కుకోవడం పాత పాయింటే. కాకపోతే ఈ పాయింట్‌కు హీరో మూగవాడు కావడం, అతని తెలివితేటలు, హవాలా నేపథ్యం, అడ్వెంచర్ అంశాలు కొత్తదనాన్ని తీసుకొచ్చాయి. తొలి సీన్‌లోనే వెయ్యి కోట్ల వ్యవహారాన్ని తెరపైకి తీసుకురావడం, హీరోను దొంగగా పరిచయం చేయడం, ప్రేమకథ.. ఇలా అన్నీ చకచకా సాగిపోతుంటాయి. ముఖ్యంగా హవాలా ఎపిసోడ్ ఆకట్టుకుంటుంది. సెకండాఫ్ కథ కూడా వెయ్యి కోట్ల వ్యవహారం చుట్టూనే తిరుగుతుంది. కాకపోతే విరామంలోనే కథ రివీల్ కావడంతో ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు ప్రేక్షకుల ఊహకు అందిపోతాయి. పెన్‌డ్రైవ్, పాస్‌వర్డ్, టైమ్‌లైన్ చుట్టూ తిరిగే సన్నివేశాల్లో జోరు తగ్గింది. అయితే చివర్లో లవ్‌స్టోరీని నడిపించిన తీరు, హీరో తెలివితేటలను దర్శకుడు కొత్తగా రాసుకున్న విధానం బాగుంది.

నటీనటుల నటన:

తొలి సినిమాతోనే మూగవాడి పాత్ర పోషించడం అంత తేలికైన విషయం కాదు. అనీష్‌కు ఈ విషయంలో మంచి మార్కులు పడతాయి. తన యాక్షన్, డ్యాన్సులు బాగున్నాయి. తన స్క్రీన్ ప్రెజెన్స్ కూడా ప్రామిసింగ్‌గా ఉంది. అనస్వర పాత్ర చలాకీగా ఉంది. ప్రేమకథ కూడా సినిమాలో కొత్తదనాన్ని జోడించింది. ముఖేష్ రుషి ట్రాక్‌ను ఇంకాస్త కొత్తగా రాసుకోవాల్సింది. వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ తమ కామెడీతో నవ్వులు పంచారు.

టెక్నికల్‌గా ఎలా ఉంది?

తమన్ పాటలు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సన్నివేశాలను ఎలివేట్ చేసింది. ఫొటోగ్రఫీ, ఆర్ట్, ప్రొడక్షన్ డిజైనింగ్‌లో నాణ్యత కనిపించింది. వెంకీ కుడుముల నిర్మాతగా మంచి కథనే ఎంచుకున్నారు. క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్ కావడం ఈ సినిమాకు మరో బలం.

త్రిగుణ్ 'జంగా' గ్లింప్స్ విడుదల.. రా అండ్ రస్టిక్ లుక్‌లో అదరగొట్టిన హీరో!

శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్‌కె ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి నిర్మిస్తున్న సరికొత్త చిత్రం 'జంగా'. కెవిన్ గడ్డం (శ్రీహరి) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను ప్రముఖ దర్శకులు రాంగోపాల్ వర్మ తాజాగా విడుదల చేశారు. త్రిగుణ్ కెరీర్‌లో ఇది సరికొత్త మైలురాయిగా నిలవనుందని ఈ గ్లింప్స్ చూస్తే స్పష్టమవుతోంది.

ఈ చిత్రంలో త్రిగుణ్ సరసన నేహా పఠాన్ నటించగా, వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్, గగన్ విహారి, చందు గౌడ, సమీర్, నాగ మహేష్, భూపాల్ రాజు, రఘు కారుమంచి, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కొన్ని లక్షల ఏండ్లు పట్టింది.. పశువు మనిషి అవ్వడానికి.. మళ్లీ పశువు అవుతానంటే నేను ఒప్పుకోను.. మనిషి పశువు అయితే.. మరణం వదం అయితాది' అంటూ త్రిగుణ్ చెప్పిన శక్తివంతమైన డైలాగ్స్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి. రా అండ్ రస్టిక్ లుక్‌లో త్రిగుణ్ కనిపిస్తుండగా, మరోవైపు వరలక్ష్మీ శరత్ కుమార్ కూడా పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించి ఆకట్టుకుంటున్నారు.



మానవ భావోద్వేగాలు, పుట్టుక-చావుల మధ్య ఉండే సంక్లిష్టతలు, ఆధ్యాత్మిక కోణాలను స్పృశిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు కృష్ణ సౌరభ్ సంగీతం అందిస్తుండగా, వెంకట్ సి. దిలీప్ కెమెరామెన్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు అందిస్తుండగా, కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటలు రాస్తున్నారు. విభిన్న కథాంశంతో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు రానుందనే దానిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.

దిల్ రాజు చేతుల మీదుగా 'జయంత్ అండ్ ది జింగో పెన్' నుంచి 'నా కనుపాపే' సాంగ్ విడుదల



నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ తాజాగా ఈ సినిమా నుంచి మరో భావోద్వేగభరితమైన పాటను విడుదల చేసింది.ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ చిత్రంలోని 'నా కనుపాపే' అంటూ సాగే ఎమోషనల్ సాంగ్‌ను లాంచ్ చేశారు. పాటను విడుదల చేసిన అనంతరం ఆయన చిత్ర యూనిట్‌కి అల్ ది బెస్ట్ తెలిపారు. ప్రవీణ్ బొలిశెట్టి అందించిన బాణీ, సాహిత్యం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మోహిత్ కులకర్ణి సంగీతం, చిన్మయి శ్రీపాద గాత్రం అందరినీ హత్తుకునేలా ఉన్నాయి. పిల్లలు, తల్లిదండ్రుల మధ్య ఉండాల్సిన బంధాన్ని ఈ పాట ఎంతో చక్కగా కళ్ళకు కట్టింది.పిల్లలు, పేరెంట్స్, టీచర్స్ ఇలా అందరూ తప్పకుండా చూడాల్సిన చిత్రమిది. విద్యార్థుల్లో చూడాల్సింది మార్కులు కాదు.. వారి మనసులు అనే గొప్ప సందేశాన్ని ఈ సినిమా ద్వారా అందిస్తున్నారు. అందరిలోనూ స్ఫూర్తినింపేలా తెరకెక్కిన ఈ చిత్రం బాలల దినోత్సవం కానుకగా నవంబర్ 14న భారీ ఎత్తున ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఎన్టీఆర్ 'గాడ్ ఆఫ్ వార్'పై క్లారిటీ..

నిర్మాతలతో త్రివిక్రమ్ క్రేజీ పిక్, రూమర్స్‌కు చెక్ పడ్డట్లే..!



టాలీవుడ్‌లో ప్రస్తుతం భారీ అంచనాలు నెలకొల్పిన ప్రాజెక్టుల్లో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కనున్న 'గాడ్ ఆఫ్ వార్' ఒకటి. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. భారీ బడ్జెట్‌తో, విభిన్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే గత కొంతకాలంగా ఈ ప్రాజెక్ట్ విషయంలో పలు రకాల వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాణ సంస్థ హారికా హాసిని క్రియేషన్స్ మధ్య విభేదాలు వచ్చాయని, ఆయన ఈ సినిమా నుంచి తప్పుకున్నారనే ప్రచారం అభిమానులను కలవరపెట్టింది. తాజాగా మేకర్స్ విడుదల చేసిన ఓ ఫొటోతో ఈ వార్తలకు చెక్ పడినట్లయింది.

ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో సినిమా వస్తుందంటే సహజంగానే అంచనాలు భారీగా ఉంటాయి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అరవింద సమేత వీర రాఘవ' ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు మరోసారి ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా రూపొందనుండటంతో నందమూరి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'గాడ్ ఆఫ్ వార్' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. హారికా హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థల సంయుక్త నిర్మాణంలో చినబాబు, నందమూరి కల్యాణ్ రామ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.అయితే ఈ సినిమా విషయంలో ఇటీవల కొన్ని ఊహించని ప్రచారాలు తెరపైకి వచ్చాయి. త్రివిక్రమ్ శ్రీనివాస్, హారికా హాసిని క్రియేషన్స్ మధ్య ఏవో విభేదాలు తలెత్తాయని, దీంతో ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారనే వార్తలు వినిపించాయి. అంతేకాకుండా సినిమా నిర్మాణంలో కూడా కొన్ని మార్పులు చోటుచేసుకోబోతున్నాయనే ప్రచారం జరిగింది.ఈ వార్తలతో ఎన్టీఆర్ అభిమానుల్లో కొంత ఆందోళన నెలకొంది. ఇంతటి క్రేజీ ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందే ఇలాంటి సమస్యలు ఎందుకు వస్తున్నాయంటూ సోషల్ మీడియాలో చర్చలు జరిగాయి. తాజాగా చిత్ర బృందం విడుదల చేసిన ఓ ఫొటో ఈ ప్రచారాలకు సమాధానంగా నిలిచింది. ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో పాటు నిర్మాతలు చినబాబు, కల్యాణ్ రామ్ కలిసి దిగిన ఫొటోను మేకర్స్ పంచుకున్నారు. ఈ ఫొటోలో నలుగురూ ఎంతో సంతోషంగా కనిపించడం విశేషం. దీంతో త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారనే ప్రచారానికి బలం లేదని అభిమానులు భావిస్తున్నారు. అలాగే హారికా హాసిని, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలయికలోనే సినిమా కొనసాగనుందని స్పష్టమవుతోంది. ఇక ఈ భారీ చిత్రానికి కోలీవుడ్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎన్టీఆర్ సినిమాలకు అనిరుధ్ అందించిన సంగీతంపై అభిమానుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ టేకింగ్, ఎన్టీఆర్ మాస్ ఇమేజ్‌కు అనిరుధ్ సంగీతం తోడైతే సినిమా మరో స్థాయిలో ఉండబోతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

టీ20 లీగ్‌లపై ఐసీసీ కొత్త ఆంక్షలు!



ముంబై, నవంబరు 13 ప్రపంచవ్యాప్తంగా టీ20 ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్‌లు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వాటిపై మరింత నియంత్రణ తీసుకురావాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) భావిస్తోంది. లీగ్‌ల సంఖ్య పెరుగుతుండటం, అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్‌పై ప్రభావం చూపడం, అవినీతి ఆరోపణలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కొత్త నిబంధనలు రూపొందించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ ప్రతిపాదనలపై బాలిలో జరగనున్న ఐసీసీ త్రైమాసిక సమావేశంలో వివిధ దేశాల క్రికెట్ బోర్డుల ముఖ్య కార్యనిర్వహణాధికారులు చర్చించనున్నారు.బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ తమీమ్ ఇక్బాల్ నేతృత్వంలో ఏర్పాటైన సమీక్షా కమిటీ ఫ్రాంచైజీ లీగ్‌ల నియంత్రణకు సంబంధించి పలు కీలక సిఫార్సులు చేసింది. ఈ కమిటీలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రతినిధి రిచర్డ్ గౌల్డ్, క్రికెట్ ఆస్ట్రేలియాకు చెందిన టాడ్ గ్రీన్‌బర్గ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సభ్యులుగా ఉన్నారు. ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌ల నిర్వహణ విధానంతో పాటు వాటి ఆదాయ మార్గాలపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.ప్రతి లీగ్‌లోనూ తుది జట్టులో గరిష్ఠంగా నలుగురు విదేశీ ఆటగాళ్లకే అవకాశం కల్పించాలని కమిటీ సూచించినట్లు సమాచారం. ప్రస్తుతం యూఏఈకి చెందిన అంతర్జాతీయ లీగ్ టీ20లో తొమ్మిది మంది, అమెరికా మేజర్ లీగ్ క్రికెట్‌లో ఆరుగురు విదేశీ ఆటగాళ్లు తుది జట్టులో ఆడేందుకు అవకాశం ఉంది. కొత్త నిబంధన అమల్లోకి వస్తే ఈ లీగ్‌ల జట్ల కూర్పులో మార్పులు తప్పవు. స్థానిక ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు కల్పించాల్సి రావడంతో పోటీతత్వం, జట్ల సమతుల్యత, వాణిజ్య విలువపై ప్రభావం పడవచ్చని అంచనా. ఫ్రాంచైజీ లీగ్‌లకు అనుమతులు ఇచ్చే విషయంలోనూ ఐసీసీకి మరిన్ని అధికారాలు కల్పించాలని కమిటీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయా దేశాల క్రికెట్ బోర్డులే తమ పరిధిలోని లీగ్‌లకు అనుమతులు ఇస్తున్నాయి. ఇకపై వాటిని సమీక్షించడంతో పాటు, అవసరమైతే అనుమతులను రద్దు చేసే అధికారం కూడా ఐసీసీకి ఉండాలని సూచించినట్లు సమాచారం. లీగ్‌లలో పారదర్శకత పెంచేందుకు ఐసీసీ అవినీతి నిరోధక విభాగం పర్యవేక్షణను తప్పనిసరి చేయాలని ప్రతిపాదించింది. బెట్టింగ్ సంస్థలు, వాటి అనుబంధ సంస్థల నుంచి వచ్చే స్పాన్సర్‌షిప్‌లపై ఆంక్షలు విధించే అంశాన్నీ పరిశీలిస్తోంది. ఈ నిర్ణయాలు అమలైతే దక్షిణాఫ్రికా ఎస్ఏ20 సహా పలు లీగ్‌ల ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉంది.ఐసీసీ ప్రతిపాదనలపై కొన్ని ఫ్రాంచైజీ లీగ్‌ల నిర్వాహకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొనసాగుతున్న లీగ్‌లకు పాత నిబంధనలే వర్తిస్తాయన్న భరోసా గతంలో ఇచ్చారని ఓ ఫ్రాంచైజీ అధికారి పేర్కొన్నట్లు కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పుడు విదేశీ ఆటగాళ్ల సంఖ్యను తగ్గిస్తే లీగ్‌ల నిర్వహణ కష్టతరమవుతుందని ఆయన అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ముఖ్య కార్యనిర్వహణాధికారుల కమిటీ చర్చించి, తుది నిర్ణయం కోసం ఐసీసీ బోర్డుకు సిఫార్సులు పంపనుంది. అయితే ప్రస్తుతం ఇవన్నీ ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. ఐసీసీ బోర్డు ఆమోదం తెలిపిన తర్వాతే నిబంధనల అమలుపై స్పష్టత రానుంది.

తొలి ఓవర్‌లోనే షాకిచ్చిన మ్యాట్ హెన్రీ.. రోహిత్, కోహ్లీ, అయ్యర్ డకౌట్



మౌంట్ మౌంగనుయి: న్యూజిలాండ్ స్పీడ్ బౌలర్ మ్యాట్ హెన్రీ(వీఫ్ ఎవఅతీఎ) తొలి ఓవర్‌లోనే షాకిచ్చాడు. భారత టాపార్డర్‌లో కీలకమైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్‌లను ఔట్ చేశాడు. 334 పరుగుల భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన టీమిండియాకు మొదటి ఓవర్‌లోనే జలక్ తగిలింది. హెన్రీ వేసిన తొలి బంతికే.. రోహిత్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న అలెన్ ఆ బంతిని అందుకున్నాడు. ఇక ఆ తర్వాత మూడు బంతులు ఆడిన కోహ్లీ.. నాలుగో బంతికి క్లీన్ ఔల్డ్ అయ్యాడు. కోహ్లీ కూడా డకౌట్ అయ్యాడు. ఆరో బంతికి కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ ఎల్బీడబ్ల్యూ అయ్యాడు. రోహిత్, కోహ్లీ, అయ్యర్.. ముగ్గురూ డౌకట్ అయిన భారత జట్టును పీకల్లోతు కష్టాలో నెట్టారు. మ్యాన్ హెన్రీ తన బౌలింగ్ స్కిల్‌తో తొలి ఓవర్‌లో ఒక్క పరుగు కూడా ఇవ్వలేదు. తాజా సమాచారం ప్రకారం ఇండియా ఆరు ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 9 రన్స్ చేసింది. క్రీజ్‌లో ఇషాన్, అక్షర్ ఉన్నారు. క్రికెట్ హిస్టరీలో తొలి ఓవర్‌లోనే ముగ్గురు బ్యాటర్లు డకౌట్ కావడం ఇదో రెండోసారి. గతంలో శ్రీలంక బౌలర్ చామిండ వాస్ బౌలింగ్‌లో.. తొలి ఓవర్‌లోనే నలుగురు ప్లేయర్లు ఔటయ్యారు. 2003 వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో చమిండ వాస్ తొలి మూడు బంతుల్లో మూడు వికెట్లు తీసి హ్యాట్రిక్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాత ఆరో బంతికి మరో వికెట్ తీసి ఆ ఓవర్‌లో 5 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటి వరకు క్రికెట్ చరిత్రలో తొలి ఓవర్‌లోనే మూడు లేదా అంతకన్న ఎక్కువ వికెట్లు తీసిన మరో బౌలర్ ఎవరూ లేరు.

ఖవాజా వ్యాఖ్యలను ఖండించిన కమిన్స్

సిడ్నీ, నవంబరు 13 ఆస్ట్రేలియా క్రికెట్‌లో సంచలనం సృష్టించిన 2018 బాల్ ట్యాంపరింగ్ వివాదంపై మాజీ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలను ప్రస్తుత కెప్టెన్ పాట్ కమిన్స్ తీవ్రంగా ఖండించాడు. ఖవాజా తన ఆత్మకథలో రాసిన విషయాలు పూర్తిగా తప్పని స్పష్టం చేశాడు. అప్పట్లో జట్టులోని సభ్యులందరికీ సాండ్‌పేపర్‌తో బంతిని రుద్ది ట్యాంపరింగ్ చేస్తున్న విషయం తెలుసని ఖవాజా పేర్కొనడాన్ని కమిన్స్ తప్పుబట్టాడు.2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్ సందర్భంగా ఆస్ట్రేలియా జట్టు బాల్ ట్యాంపరింగ్ వివాదంలో చిక్కుకుంది. సాండ్‌పేపర్‌తో బంతి స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి రావడంతో అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా నిషేధం విధించింది. ఈ ఘటనపై తాజాగా ఖవాజా తన ఆత్మకథలో చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి.జట్టులోని సభ్యులందరికీ సాండ్‌పేపర్ గురించి ముందే తెలుసన్న ఖవాజా వ్యాఖ్యలు వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయని కమిన్స్ తెలిపాడు. ఆటగాళ్లు మైదానంలోకి వెళ్లే ముందే సాండ్‌పేపర్ ఉందని అందరికీ తెలుసన్న అర్థం వచ్చేలా ఖవాజా రాశాడని, అది పూర్తిగా తప్పని పేర్కొన్నాడు. గత ఎనిమిదేళ్లుగా ఈ ఘటనపై తాను



ఇదే విషయం చెబుతున్నానని, అసలు ఏం జరిగిందో తనకు తెలియదని స్పష్టం చేశాడు. తాను, ఇతర ఆటగాళ్లు కూడా ట్యాంపరింగ్‌లో భాగస్వాములమన్నట్లుగా ఖవాజా చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవని అన్నాడు.ఈ వివాదంపై కమిన్స్ సుమారు 70 నిమిషాల పాటు మీడియాతో మాట్లాడాడు. 2018 ఘటన జరిగిన సమయంలో అతడు కూడా ఆస్ట్రేలియా జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. కమిన్స్, ఖవాజా కలిసి 56 టెస్టు మ్యాచ్‌లు ఆడారు. ఈ ఏడాది జనవరిలో ఖవాజా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇద్దరూ గతంలో న్యూ సౌత్ వేల్స్ తరఫున దేశవాళీ క్రికెట్‌లోనూ కలిసి ఆడారు.

భారత్‌పై న్యూజిలాండ్ భారీ విజయం

మౌంట్ మౌంగనుయి, నవంబరు 13 న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. కివీస్ 244 పరుగుల భారీ తేడాతో భారత్‌ను ఓడించింది. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 2–1కి తగ్గింది. న్యూజిలాండ్ బౌలర్ మ్యాట్ హెన్రీ భారత బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. తొలి ఓవర్‌లోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్‌లను డకౌట్‌గా వెనక్కి పంపి భారత శిబిరంలో కలవరం సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం ఆరు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 333 పరుగులకు ఆలౌటైంది. కివీస్ బ్యాటర్ యంగ్ అద్భుతంగా ఆడి 125 పరుగులు సాధించాడు. మిగతా బ్యాటర్లు కూడా తమ వంతు సహకారం అందించడంతో న్యూజిలాండ్ భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లు ప్రత్యర్థి పరుగుల వేగాన్ని పూర్తిగా అడ్డుకోలేకపోయారు. 334 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆరంభంలోనే కుప్పకూలింది. మ్యాట్ హెన్రీ తన తొలి ఓవర్‌లోనే రోహిత్, కోహ్లీ, అయ్యర్‌లను పెవిలియన్‌కు పంపాడు. ఆ దెబ్బ నుంచి భారత జట్టు కోలుకోలేకపోయింది. ఇషాన్ కిషన్ 27 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, అక్షర్ పటేల్, నమన్ చెరో 21 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు విఫలమవడంతో భారత్ 26.4 ఓవర్లలో కేవలం 89 పరుగులకే ఆలౌటైంది.వన్డే



క్రికెట్‌లో భారత్‌కు ఇది అత్యంత భారీ పరాజయాల్లో ఒకటిగా నిలిచింది. 2000 అక్టోబరులో శ్రీలంక చేతిలో 245 పరుగుల తేడాతో ఓడిన తర్వాత, ఇంతటి భారీ తేడాతో భారత్ ఓటమి చవిచూడడం ఇదే తొలిసారి అని కథనం పేర్కొంది. దాదాపు 26 ఏళ్ల తర్వాత భారత జట్టు మరోసారి ఇలాంటి పరాజయాన్ని ఎదుర్కొంది.

17 ఏండ్ల తర్వాత టాలీవుడ్‌లోకి కంగనా రనౌత్.. రవిబాబు దర్శకత్వంలో క్రేజీ హారర్

నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో టాలెంటెడ్ డైరెక్టర్ రవిబాబు దర్శకత్వంలో ఓ హారర్ సినిమా తెరకెక్కుతోంది. 'స్కేరీ పిక్చర్' (ఫ్రెఘతీఎ్రాఅఖీబతీవ) పేరుతో రానున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై డి. సురేష్ బాబు నిర్మిస్తుండగా, ప్రముఖ హీరో కమ్ ప్రొడ్యూసర్ రానా దగ్గుబాటి కీలక భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. న్యూఢిల్లీలో జరిగిన 'హారర్‌కాన్ ఇండియా' వేదికగా రానా ఈ సినిమా వివరాలను వెల్లడించగా, తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కంగనా రనౌత్ చివరిసారిగా 2009లో ప్రభాస్ సరసన పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఏక్ నిరంజన్' చిత్రంలో నటించారు. సరిగ్గా 17 ఏళ్ల తర్వాత ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండటంతో ఇది టాలీవుడ్‌లోకి ఆమె రీఎంట్రీగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఇది ప్రముఖ తెలుగు దర్శకుడు రవిబాబు తెరకెక్కిస్తున్న హిందీ చిత్రంగా తెలుస్తోంది. ఈ సినిమా ద్వారా రవిబాబు కూడా బాలీవుడ్ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. విభిన్నమైన హారర్, థ్రిల్లర్ చిత్రాలు తీయడంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న రవిబాబు దర్శకత్వంలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను 2027లో థియేటర్లలోకి తీసుకురావడానికి



మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

సెమీస్‌కు సేన్.. శ్రీకాంత్ ఔట్



కుమమొటో: జపాన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లగా.. సీనియర్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ ఇంటిదారి పట్టాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ ఉన్న లక్ష్య 21–16, 21–15తో జపాన్ ఆటగాడు యుషి తనకాపై విజయం సాధించాడు. సెమీఫైనల్లో అతను ఇండోనేషియా షట్లర్, ఆరో సీడ్ అల్వీ ఫర్హాన్‌తో తలపడనున్నాడు. మరో క్వార్టర్ ఫైనల్లో 31వ ర్యాంకర్ శ్రీకాంత్ 22–24, 15–21తో జపాన్‌కు చెందిన ప్రపంచ 15వ ర్యాంకర్ కోకి వటానబే చేతిలో ఓడిపోయాడు.

అర్జున అవార్డు అందుకున్న ధనుష్ శ్రీకాంత్



న్యూఢిల్లీ: తెలంగాణ షూటర్ ధనుష్ శ్రీకాంత్ ప్రతిష్టాత్మక క్రీడా పురస్కారం అర్జున అవార్డు అందుకున్నాడు. రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2026 జాతీయ క్రీడా పురస్కారాలను విజేతలకు ప్రదానం చేశారు. శ్రీకాంత్ (డెఫ్ షూటింగ్) సహా మొత్తం 17 మంది క్రీడాకారులు ప్రతిష్టాత్మక అర్జున అవార్డులకు ఎంపికయ్యారు.2014 తర్వాత తొలిసారిగా మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న పురస్కారం ఎవరికీ ప్రకటించకుండానే ఈ వేడుకను నిర్వహించడం గమనార్హం. అర్జున అవార్డు అందుకున్న వారిలో తేజస్విన్ శంకర్ (అథ్లెటిక్స్), దివ్య దేశ్‌ముఖ్, విదిత్ గుజరాతీ (చెస్), ట్రీసా జాలీ (బ్యాడ్మింటన్), నరేందర్ (బాక్సింగ్) తదితరులు ఉన్నారు.

వికారాబాద్‌లో క్రికెటర్ ఆత్మహత్య



వికారాబాద్, నవంబర్ 13: క్రీడల్లో రాణిస్తూ ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్న ఓ మహిళా క్రికెటర్ ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. యువకుల వేధింపుల కారణంగానే ఆమె ప్రాణాలు తీసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా, పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వికారాబాద్ సీఐ రఘుకుమార్, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా యాలాల మండలం సంగాయిపల్లి తండాకు చెందిన నందిని (19) ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. అండర్ 19 విభాగంలో క్రికెట్ ఆడుతోంది. వికారాబాద్ పట్టణంలోని మధుకాలనీలో ఉన్న తన మేనమామ రమేష్ ఇంట్లో ఉంటూ సాధన చేస్తోంది. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నందిని ఫ్యాన్ హుక్‌కు చున్నీతో ఉరివేసుకుంది. గమనించిన మేనమామ రమేష్ వెంటనే ఆమెను కిందకు దించి దవాఖానాకు తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే నందిని మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఇద్దరు యువకుల వేధింపులే కారణమంటూ బంధువుల ఆందోళన

నందిని మృతిపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ ఆమె తండ్రి వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రేమించాలంటూ పరిగి ప్రాంతానికి చెందిన కృష్ణ, అనిల్ అనే ఇద్దరు యువకులు గత కొంతకాలంగా తన కూతురిని వెంటపడి వేధిస్తున్నారని, వారి వేధింపులు తట్టుకోలేకే ఆత్మహత్యకు పాల్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. నందిని మృతికి కారణమైన యువకులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నాకు దిగారు. పోలీసులు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దర్యాప్తులో భాగంగా నందిని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, అందులోని కాల్ వివరాలు, చాటింగ్‌లు ఇతర డిజిటల్ ఆధారాలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. బాధ్యులపైచట్టపరమైనచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609